విశాలాంధ్ర

కృష్ణా, ఎన్టీఆర్
గుంటూరు, పల్నాడు

గురువారం 26 జూన్ 2025 8 పేజీలు

ప్రజల మనస్సులు గెలవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

క్రమ పద్ధతిలో హామీల అమలు : మంత్రి లోకేష్

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : ప్రజల మనస్సు గెలవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ఈ దిశగా ఏడాది పాలనలో సుపరిపాలన దిశగా అడుగులు వేశామని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటి ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్ రియల్ టైం గవర్నన్స్ శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. బుధవారం మచిలీపట్నం కృష్ణా విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు వచ్చిన లోకేష్‌కు మూడుస్తంబాల సెంటర్ వద్ద ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఈ కాలంలో కొన్ని కార్యక్రమాలు చేశామని, ఇంకా చేయాల్సిన కార్యక్రమాలు చాలా ఉన్నాయన్నారు. త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. తొలి ఏడాదిలో గుంతలు పడిన రహదారులన్నింటిని పూడ్చి బాగుపరిచామని, సూపర్ సిక్స్‌లో భాగంగా తల్లికి వందనం పథకం కింద ఇంట్లో బడికి పోయే బిడ్డలు ఎంతమంది ఉంటే అందరికీ ఆర్థిక సాయం అందిస్తామని ఇచ్చిన హామిని నిలబెట్టుకున్నామన్నారు. తల్లికి వందనం పథకం కింద కేవలం మహిళలకు డబ్బులు ఇవ్వడమే కాదని మహిళలను గౌరవించడం తమ ప్రభుత్వ ధ్యేయం అన్నారు. ఇందులో భాగంగా వచ్చే జూలై 5వ తేదీన తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థుల భవిష్యత్తు ఎలా ఉండాలి అనే విషయంపై చర్చించేందుకు సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. మహిళలందరి దగ్గర ఆశీర్వాదం తీసుకోవాలన్నదే తమ ప్రభుత్వ ఆశయమన్నారు. దీపం పథకం కింద 2 కోట్ల ఉచిత గ్యాస్ సిలెండర్లను అందచేశామని, మహిళల అభిప్రాయాలను తెలుసుకున్న తర్వాత గ్యాస్ సిలెండర్లు తీసుకున్న లేక తీసుకోకపోయినా ప్రభుత్వం ఇచ్చే రాయితీని వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసేందుకు నిర్ణయం -మిగతా 2 లో ...

సీఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

పరిశీలించిన హోం మంత్రి అనిత

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గురువారం స్థానిక ఇన్నర్ రింగ్ రోడ్ లోని శ్రీ కన్వెన్షన్‌లో జరిగే యాంటీ నార్కోటిక్స్ డే లో పాల్గొనున్నందున అక్కడ ఏర్పాట్లను బుధవారం రాష్ట్ర హెూం మరియు విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనితా, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, ఈగల్ చీఫ్ ఆకే రవికృష్ణ , జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, శాసన సభ్యులు మహమ్మద్ నసీర్ అహ్మద్, గల్లా మాధవితో కలిసి పరిశీలించారు. శ్రీ కన్వెన్షన్‌లో హెలిపాడ్ వద్ద, సభా ప్రాంగణంలో -మిగతా 2 లో ...

మంచి కాదు... ముంచారు

కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై వైఎస్ షర్మిల విమర్శ

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలరెడ్డి విమర్శలు గుప్పించారు. ప్రజలకు ఏమి మంచి చేశారని చెప్పుకుంటారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంచి కాదు... మమ్మల్ని ముంచారని ఓట్లు వేసి గెలిపించిన ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారన్నారు. ముంచిన వాడే మంచి చెబుతానంటే దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్లు ఉందని ఎద్దేవాచేశారు. గుంటూరు -మిగతా 2 లో ...

యుద్ధంతో ఆర్థిక సంక్షోభం

సామాన్యప్రజల జీవన విధానంపై ప్రభావం... సీపీఐ నగర కార్యదర్శి జి కోటేశ్వరరావు

విశాలాంధ్ర-విజయవాడ: యుద్ధాల ప్రభావం తీవ్ర ఆర్థిక సంక్షోభానికి దారితీస్తుందని, దీంతో సామాన్య ప్రజల జీవనవిధానం దెబ్బతింటుందని సీపీఐ నగర కార్యదర్శి జి కోటేశ్వరరావు అన్నారు. ఈ దాడులను తీవ్ర స్థాయిలో ఖండిస్తూ వాపపక్ష పార్టీల దేశ వ్యాప్త పిలుపులో భాగంగా బుధవారం విజయవాడలోని ధర్నాచౌక్ వద్ద ఇరాన్‌పై ఇజ్రాయిల్ దాడులకు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. ఈ నిరసనలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి, శ్రీనివాసరావు వామపక్ష పార్టీ నాయకులు ముఖ్యఅతిథితులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జి కోటేశ్వరరావు మాట్లాడుతూ ఇరాన్‌పై దాడి చేయడాన్ని -మిగతా 2 లో ...

200 కేజీల గంజాయి పట్టివేత

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): గంజాయి కేసులో ఇద్దరి నిందితులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి సుమారు రూ.15లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బుధవారం విజయవాడ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సీపీ రాజశేఖరబాబు కేసు సంబంధించిన వివరాలను వెల్లడించారు. విజయవాడ కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలోని గీతానరగ్ కట్ట ప్రాంతంలో ఎస్సై బాను ప్రసాద్ వాహనాలు తనిఖీలు చేస్తున్న సమయంలో షిఫ్ట్ డిజైర్ కారును తనిఖీ చేశారు. అందులో గంజాయి కలిగిన బ్యాగులను గుర్తించారు. అదే మార్గంలో వెనుక నుంచి టాటా గూడ్స్ వాహనం డ్రైవర్ పోలీసులను చూసి పారిపోతుండంగా అతనిని అదుపులోకీ తీసుకున్నారు. వారి వద్ద నుంచి సుమారు రూ.15లక్షల విలువైన 200 కేజీల గంజాయిని, రెండు -మిగతా 2 లో ...

(మొదటి పేజీ తరువాయి)

సీఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

జరుగుతున్న ఏర్పాట్లు, అమరావతి రోడ్డు లోని ఫీవర్ ఆసుపత్రి వద్ద వాక్‌థాన్ కు సంబంధించిన ఏర్పాట్లపై హోంమంత్రి అనిత శాసన సభ్యులు, జిల్లా అధికారులతో చర్చించి సూచనలు అందించారు. ఈ సందర్భంగా హోంమంత్రి విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ను మాదక ద్రవ్య రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దటానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈగల్ ను స్థాపించి గంజాయి వినియోగాన్ని అరికట్టేందుకు ఉక్కుపాదం మోపడంతో పాటు, డ్రగ్స్ నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. దేశవ్యాప్తంగా జరిగే ఈ కార్యక్రమంలో రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గుంటూరులో ప్రారంభిస్తారని, మిగతా జిల్లాల్లోనూ ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించడం జరుగుతుందన్నారు. యాంటీ నార్కోటిక్స్ డే సందర్భంగా ఫీవర్ హాస్పిటల్ సెంటర్ నుంచి చిల్లీస్ జంక్షన్ వరకు జరిగే ర్యాలీ పాదయాత్రలోను, అనంతరం శ్రీ కన్వెన్షన్ లో జరిగే సభా కార్యక్రమంలోను ముఖ్యమంత్రి పాల్గొంటారన్నారు. అదే విధంగా 27వ తేదీ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జరిగే ఏఐ హ్యాక్ థాన్ లోను పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయరు సజీలా, ఆర్డీవో కే.శ్రీనివాస రావు , తహసిల్దార్లు వెంకటేశ్వర్లు, సుభాని, అధికారులు పాల్గొన్నారు.

ప్రజల మనస్సులు గెలవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

తీసుకున్నామన్నారు. అలాగే నిరుద్యోగ యువత కోసం మెగా డీఎస్సీ ప్రకటించి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తున్నా మన్నారు. ప్రభుత్వం ఎన్ని చట్టాలు తెచ్చినా సమాజంలో మార్పు రానిదే సాధ్యం కాదన్నారు.మహిళలను, ఆడబిడ్డలను గౌరవించడంపై సమాజంలో మార్పు రావాలంటే మొదట మన ఇంటి నుంచే మార్పు మొదలు కావాలన్నారు. ఇంట్లో వాడే భాష మారాలని, మహిళలను గౌరవించే కార్యక్రమం పాఠశాల స్థాయి నుండి ప్రారంభించి ఎంతో బాధ్యతగా ముందుకు తీసుకెళ్లామన్నారు. తనకు 24 సంవత్సరాల వయస్సులోనే బ్రహ్మణితో పెళ్లయిందని, తాను, బ్రహ్మణి ఇంట్లో పనులు సమానంగా చేసుకుంటామన్నారు. ఆమె సహకారం లేనిదే తాను ప్రజాసేవ చేయలేనన్నారు. అందరూ ప్రశాంతంగా హాయి గా జీవనం సాగించేందుకు తమ ప్రభుత్వం భరోసా ఇస్తుందన్నారు.

గత ప్రభుత్వ హయాంలో ఈ పరిస్థితి లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో తనపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులతో సహా 23 కేసులు పెట్టారని, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ను అకారణంగా 54 రోజులపాటు జైలులో ఉంచారన్న విషయాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ పరిస్థితుల్లోనే ప్రజలందరూ కలిసి కూటమిని బంపర్ మెజారిటీతో గెలిపించారన్నారు. దేశంలో ఎక్కడా రాని విధంగా 94 శాతం సీట్లు ఇచ్చి గెలిపించిన ఘనత ప్రజలదేనని, ఇది ప్రజల విజయమని, అహర్నిశలు మీ భవిష్యత్తు బాగుండాలని కూటమి ప్రభుత్వం ఆలోచిస్తుందన్నారు.

రాష్ట్ర కార్మికులు, కర్మాగారాలు, బాయిలర్లు, భీమా, వైద్య సేవల శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జ్ మంత్రి వాసంశెట్టి సుభాష్, రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఏపిఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వర రావు, జిల్లాకలెక్టర్ డీకె. బాలాజీ, జిల్లా ఎస్పీ ఆర్. గంగాధర రావు, మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి, పెనమలూరు, పెడన, గుడివాడ, పామర్రు శాసనసభ్యులు బోడే ప్రసాద్; కాగిత కృష్ణప్రసాద్, వెనిగండ్ల రాము, వర్ల కుమార్ రాజా, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, రాష్ట్ర మంత్రివర్యులు లోకేష్ కు మర్యాదపూర్వకంగా పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గీతాంజలీ శర్మ, మాజీ ఉపసభాపతి బూరగడ్డ వేదవ్యాస్, డిఆఓ పివిజె. రామారావు, మెప్మాపిడి సాయిబాబు, ఆర్డీఓ కే. స్వాతి, మున్సిపల్ కమిషనర్ కే. బాపిరాజు, స్థానిక నాయకులు కుంచె నాని, తదితర అధికారులు, అనధికారులు, కూటమి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

మంచి కాదు... ముంచారు

రాజీవ్‌గాంధీ భవన్‌లో బుధవారం జరిగిన కాంగ్రెస్ పార్టీ గుంటూరు జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి విచ్చేసిన ఆమె మీడియాతో మాట్లాడారు. ఏడాది పాలనలో చంద్రబాబు ప్రజలకు చేసిన మంచి ఏమిటని ప్రశ్నించారు. సంవత్సర పాలనలో రూ.17 వేల కోట్ల విద్యుత్ భారాలను ప్రజలపై మోపడమా మంచి అంటే అని నిలదీశారు. పంటకు గిట్టుబాటు ధర లేక అప్పుల పాలైన రైతు ఆత్మహత్యలకు పాల్పడుతున్నాడని వీరికి ఏమి మంచి చేశారని అన్నారు. అన్నదాత సుఖీభవ పథకానికి లక్షలాది మంది రైతులను దూరం చేస్తున్నారని ఇది ముంచే ప్రయత్నం కాదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో 87 లక్షల మంది విద్యార్థులు ఉంటే కేవలం 67 లక్షల మందికి తల్లికి వందనం పథకం అమలు చేశారని, మరీ ఈ ప్రభుత్వం ఏమి మంచి చేసిందో అర్థం కావడం లేదన్నారు. నిరుద్యోగ భృతి, 50 ఏళ్లకే పెన్షన్ పథకాల గురించి కనీసం మాట్లాడటం లేదన్నారు. ఆరోగ్యశ్రీకి సక్రమంగా నిధులు ఎందుకు ఇవ్వడం లేదని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.4200 కోట్లు ఎందుకు విడుదల చేయడం లేదని ప్రశ్నించారు. బీజేపీ రాష్ట్రానికి ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని, ప్రస్తుతం ఇస్తున్న నిధులు కూడా అప్పుగానే ఇస్తుందని అయినా రాష్ట్రంలోని వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీలు మోడీకి తొత్తులుగా మారి పొత్తులు పెట్టుకుంటు న్నాయని విమర్శించారు. బీజేపీని ప్రశ్నించగలిగే పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని, గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసుకుని రాహుల్ గాంధీని ప్రధానిని చేస్తే రాష్ట్రానికి ఇచ్చిన విభజన హామీలు నెరవేరుస్తారని చెప్పారు.

జగన్ బలప్రదర్శన పర్యటనలు నిషేధించాలి:

తన బలప్రదర్శన చూపించడానికి జగన్ చేస్తున్న పర్యటనలలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, తక్షణమే జగన్ బలప్రదర్శన పర్యటనలను నిషేధించాలని వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. జగన్ పర్యటన సందర్భంగా గుంటూరులో జగన్ కారు కింద వైసీపీ కార్యకర్త పడితే మానవత్వం లేకుండా అతనని పట్టించుకోకుండా వెళ్ళిపోవడం తప్పని అన్నారు. తమలాంటి వారికి ఆంక్షలు విధిస్తూ ధనబలం కలిగిన వారికి ఆంక్షలు పనిచేయకపోవడం పట్ల ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఏఐసీసీ సెక్రటరీ, ఏపీ ఇన్‌చార్జ్ పాలకవర్గ, జిల్లా అధ్యక్షులు చిలకా విజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు లింగంశెట్టి ఈశ్వరరావు, షేక్ మస్తాన్‌వలి, గద్దం పాల్ విజయ్ కుమార్, మోహన్ రెడ్డి, శ్రీపతి ప్రకాశం, బిళ్ళా సునీల్, డాక్టర్ జాన్‌బాబు, షేక్ కరీం తదితరులు పాల్గొన్నారు.

యుద్ధంతో ఆర్థిక సంక్షోభం

అమెరికా కుంటిసాకులు చెబుతోందన్నారు. అమెరికా ఇంటెలిజెన్స్ సంస్థలు, అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ ఇరాన్ అణ్వాయుధాన్ని తయారు చేస్తోందని తమ వద్ద నిర్దిష్ట ఆధారమేదీ లేదని అంగీకరించాయని తెలిపారు. అయినప్పటికీ ఇరాన్‌పై ఇజ్రాయిల్ దాడులు చేస్తోందని అమెరికా కూడా ఈ దాడులకు ఇజ్రాయిల్‌తో చేతులు కలిపిందని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితులలో ఇరాన్‌పై దాడి చేయడం పశ్చిమ ఆసియాపై పెత్తనం చెలాయించేందుకేనని, ప్రపంచాన్ని భయపెట్టేందుకేనని స్పష్టం అవుతున్నదన్నారు.ఏ విధంగా చూసినప్పటికీ అమెరికా దాడి ప్రపంచ వ్యాప్తంగా ఘర్షణలను తీవ్రతరం చేస్తుందన్నారు. ఈ దాడి ప్రపంచ శాంతి పైన, సాధారణ ప్రజల జీవనోపాధి మీద వినాశకరమైన ప్రభావం పడుతుందన్నారు. ఈ నిరసనలో పార్టీ నగర సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు, నగర కార్యదర్శి వర్గ సభ్యులు బుట్టి రాయప్ప, కె భాస్కరరావు, దాడి పైడయ్య, మూలి సాంబశివరావు, పంచదర్ల దుర్గాంబ, కొట్టు రమణరావు, కార్యవర్గ సభ్యులు డివి రమణబాబు, సంగుల పేరయ్య, తూనం వీరయ్య, కొడాలి ఆనందరావు, ఓర్సు భారతి, సూరిబాబు, సింగరాజు సాంబశివరావు, ప్రజానాట్య మండలి నగర అధ్యక్షుడు షేక్ నజీర్ తదితర నాయకులు, కార్యకర్త పాల్గొన్నారు.

200 కేజీల గంజాయి పట్టివేత

వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. విశాఖపట్నం తగరపువలస, భీమునిపట్నంకు చెందిన అండి నాగరాజు(26), తమిళనాడు రాష్ట్రం ఉత్తమ పలయాన్,కక్కి సింగయాన్ పట్టి గ్రామానికి చెందిన అనబగన్ సిన్రసు(46)లను అరెస్టు చేశారు. నాగరాజు స్వంత గ్రామం తమిళనాడు మధురై. ఉపాధి కోసం చిన్నతనంలోనే తగరపువలస వచ్చి జీవిస్తున్నాడు. తమిళనాడులో గంజాయికు ఎక్కువ డిమాండ్ ఉందని తెలుసుకుని, తగరపువలస చుట్టు ప్రక్కల ఏజెన్సీ ప్రాంతాల్లో గంజాయి సాగు జరుగుతోందని తెలుసుకున్నాడు. ఇక్కడ తక్కువ ధరకు కొనుగోలు చేసి తమిళనాడులో ఎక్కువ ధరకు విక్రయించి వచ్చిన డబ్బులతో జల్సాలు చేద్దామనుకున్నాడు. తమిళనాడులో పరిచయం ఉన్న అనబగన్ సిన్రసుకు తన పథకం చెప్పి గంజాయి రవాణాకు పథకం రచించాడు. ఈక్రమంలోనే గూడ్స్ వాహనాన్ని కొంత భాగాన్ని అరలుగా తయారు చేశారు. అందులో గంజాయి కలిగిన బ్యాగులను పెట్టి ఖాళీ ఐక్స్ బాక్స్‌లను పెట్టి ఎవరికి అనుమానం రాకుండా ఆ గూడ్స్ వాహనానికి ముందు మరోక కారును నాగరాజు డ్రైవ్ చేసుకుంటూ వెళు తూ ఎప్పటికప్పుడు పోలీసుల సమాచారం గూడ్స్ డ్రైవర్‌కు తెలియపరుస్తూ గంజాయి తరలించారు. ఇలా రెండు సార్లు అరెస్టు కావడం జరిగింది. జైలు నుంచి బయటకు వచ్చిన తరువాత తన నేర వృత్తిని మానుకోకుండా ఏజెన్సీ గ్రామాల్లో 200 కేజీల గంజాయిని కొనుగోలు చేసి 100 కేజీల గంజాయిని కారులో, మరో 100 కేజీల గంజాయిని గూడ్స్ వాహనంలో పాత పద్దతిలో తరలిస్తున్నారు. దీంతో కృష్ణలంక పోలీసులకు చిక్కారు. ఈ సమావేశంలో సౌత్ ఏసీపీ డి.పావన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడి మృతి

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): గుర్తుతెలియని యువకుడు ఓ ఇంటి గేట్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన బుధవారం విజయవాడ టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. విజయవాడ వించిపేట నైజాంగేట్ ఫోర్‌మెన్ బంగ్లా రోడ్డులో గుర్తుతెలియని యువకుడు ఓ ఇంటి గేట్‌కు ఉరేసుకున్నాడు. సుమారు 35 సంవత్సరాలు కలిగి, నల్ల జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. అతని ప్యాంట్ జేబులో బీహార్ రాష్ట్రం ముజఫర్‌పూర్ ఫ్లాట్ ఫామ్ టిక్కెట్, ఈనెల 24వతేదీన విశాఖపట్నం టూ బెంగుళూరుకు చెందిన రైల్వే టిక్కెట్ లభించింది. ఎటువంటి ఆధారాలు దొరకలేదు. ఈమేరకు పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనుమాన స్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రంథాలయాల నిధులు వినియోగం దురదృష్టం

విశాలాంధ్ర-విజయవాడ: రాజారామమోహన్‌రాయ్ లైబ్రరీ ఫౌండేషన్ కలకత్తా ఇచ్చే మాచింగ్ గ్రాంటును ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ వినియోగించకపోవడం దురదృష్టకరమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ కమిటీ కన్వీనర్ వల్లూరు శివప్రసాద్ బుధవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే గ్రాంటుకు సరిసమానంగా ఆర్.ఆర్.ఎల్.ఎఫ్. స్కీం పుస్తకాల కొనుగోలుకు నిధులు ఇస్తాం దని, పదేళ్లలో ఈ అవకాశాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ వినియోగించలేదన్నారు. ఆ గ్రాంటును పొందాలంటే, బడ్జెట్ ప్రతిపాదనలతో పాటు గ్రంథాలయ పరిషత్ సభ్యుల కమిటీ పేర్లు పంపవలసి ఉంటుందని, లేని పక్షంలో నిధులు మంజూరు చేయరన్నారు. ప్రభుత్వం గ్రంథాలయ సభ్యుల కమిటీని తక్షణం భర్తీచేసి, ఈ నెలాఖరులోగా ప్రతిపాదనలు పంపి పుస్తకాల కొనుగోలు నిధులు నిరుపయోగం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయాన్ని వారం క్రితమే గ్రంథాలయ పరిషత్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లటం జరిగిందన్నారు.

ప్రభుత్వ గుర్తింపు లేని కళాశాలలను సీజ్ చేయాలి

-ఆర్ఐఓ కార్యాలయం ఎదుట ఏఐఎస్ఎఫ్ ధర్నా

విశాలాంధ్ర-విజయవాడ: ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా కళాశాలను వెంటన్ సీజ్ చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం నగరంలోని ఇంటర్మీడియేట్ ప్రాంతీయ అధికారి కార్యాలయం ఎదుట ఏఐఎస్ఎఫ్ కృష్ణాజిల్లా సమితి ఆధ్వర్యంలో ధర్నా చేపట్టింది. ఏఓకు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం సాయికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండా కళాశాలను నిర్వహిస్తూ, అక్రమంగా పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్న ప్రైవేట్,కార్పొరేట్ కళాశాలలు నడుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ఇష్టానుసారంగా ఎటువంటి అనుమతులు పొందకుండా కళాశాలలు నడుపుతూ పెద్దఎత్తున ఫీజులు వసూలు చేస్తున్నారని తెలిపారు. విజయవాడలో సందుసందుకు పది పాఠశాలలు, కళాశాలలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని. వాటికి ఎటువంటి అనుమతులు లేకపోయినా తరగతులు నిర్వహిస్తున్నారని అన్నారు. విద్యాశాఖ అధికారులు జారీ చేసిన జీవో నెంబర్ 1 తుంగలో తొక్కి పాఠ్యపుస్తకాలు,నోట్స్ పుస్తకాలు మరియు దుస్తులు పేరుతో వేలాది రూపాయలు విద్యార్థుల తల్లిదండ్రుల నుండి దోచుకుంటున్నారని తెలిపారు. అక్రమంగా దోపిడికి పాల్పడుతున్న కళాశాలపై చర్యలు తీసుకునేందుకు విద్యాశాఖ అధికారులు స్పందించకపోవడం చాలా సిగ్గుచేటన్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఉన్న ప్రతి ఒక్క కళాశాలలను తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మహిళా నాయకులు షణ్ముఖప్రియ, ప్రమోద , ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కార్తీక్, కృష్ణాజిల్లా కార్యదర్శి సాదిక్ బాబు నాయకులు క్రాంతి ,అఖి, సిద్దు , ప్రిన్స్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి నిధులు కేటాయించండి

విశాలాంధ్ర-గుడివాడ : గుడివాడ నియోజకవర్గ గ్రంథాలయాల అభివృద్ధికి తమ వంతు సహకారాన్ని అందించాలని రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ గొనుగుంట్ల కోటేశ్వరరావును కళింగ కార్పొరేట్ స్టేట్ డైరెక్టర్ మజ్జాడ నాగరాజు కలిసి విన్నతి పత్రాన్ని అందజేసినట్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడివాడ నియోజకవర్గ గ్రంథాలయాల అభివృద్ధికి తమ వంతు సహకారాన్ని అందించాలని కోరినట్లు తన ప్రకటనలో తెలిపారు.

మత్తుకు బానిస కావద్దు : ట్రైనీ డీసీపీ పావని

విశాలాంధ్ర-కంచికచర్ల: సమాజ శ్రేయస్సుకు మాదకద్రవ్యాల నియంత్రణ ఎంతో ముఖ్యమని, విద్యార్థులు గంజాయితోపాటు ఇతర మత్తు పదార్థాల బారిన పడితే భవిష్యత్ అంధకారమవుతుందని, డ్రగ్స్ ఆరోగ్యంతోపాటు జీవితాన్ని, కుటుంబాన్ని నాశనం చేస్తుందని ట్రైనీ డి సి పి బొంతా పావని పిలుపునిచ్చారు. బుధవారం అంతర్జాతీయ మాదక ద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండలంలోని పరిటాల యమ్ వి ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో యాంటీ డ్రగ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రైనీ డీసీపీ పావని మాట్లాడుతూ డ్రగ్స్ ఒక వ్యక్తిని మాత్రమే కాదు కుటుంబాన్ని, సమాజాన్ని, దేశాన్ని కూడా నాశనం చేస్తుందని, యువత తమ శక్తియుక్తులను మత్తు పదార్థాలకు అలవాటుపడి వృథా చేసుకోవద్దన్నారు. కంచికచర్ల పోలీసుల ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై ఎం.వి.ఆర్ కళాశాల విద్యార్థులతో కలసి యాంటీ డ్రగ్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నందిగామ గ్రామీణ సిఐ డి చవాన్, కంచికచర్ల ఎస్సై బోనగిరి రాజు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పెడసనగల్లులో యువకుడిపై హత్యాయత్నం

విశాలాంధ్ర, కూచిపూడి : మొవ్వ మండలం పెడసనగల్లులో అంబేద్కర్ విగ్రహం వద్ద బార్లపూడి గ్రామానికి చెందిన గోవాడరాజేష్.కు (ప్రస్తుతం విజయవాడ) పెడసనగల్లు గ్రామానికి చెందిన దాసరి కామరాజు మధ్య సోమవారం రాత్రి జరిగిన గొడవ హత్యాయత్నానికి దారి తీసింది. కూచిపూడి ఎస్ఐ కేఎన్ విశ్వనాథ్ వివరాల ప్రకారం దాసరి కామరాజు రాజేష్. పిన్ని స్వరూపరానితో సహజీవనం చేస్తున్నాడు. ఆమెతో తరచుగా గొడవ పడుతూ కొట్టటంతో ఈ విషయమై రాజేష్ కామరాజును నిలతీయడంతో కామరాజు రాజేష్‌తో గొడవ పడి చాకుతో రాజేష్‌ను పొట్టమీద పొడిచాడు. రాజేష్ విజయవాడ ప్రభుత్వహాస్పిటల్‌లో చేర్చి చికిత్స పొందుతున్నాడు. దీనిపై రాజేష్ తండ్రి గోవాడ వెంకటరావు కూచిపూడి పోలీస్ స్టేషన్లో ఇచ్చిన ఫిర్యాదుతో హత్యాయత్నం కేసుగా నమోదు చేశారు. ఈ ఘటనలో ముద్దాయి దాసరి కామరాజును కూచిపూడి ఎస్ఐ కే.ఎన్. విశ్వనాథ్ అరెస్టు చేసి బుధవారం అవనిగడ్డ కోర్ట్‌కు హాజరుపరచగా రిమాండ్ కొరకు పంపారు.

గంపలగూడెంలో గంజాయి ముఠా అరెస్ట్

విశాలాంధ్ర-గంపలగూడెం : గంజాయి విక్రయిస్తున్న ముఠాను అదుపులోకి తీసుకున్న గంపలగూడెం పోలీసులు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో సీఐకే. గిరిబాబు, ఎస్ఐఎస్. శ్రీనివాసరావు వివరాలను వెల్లడించారు. మండలంలోని పెద్ద కొమేర సమీపంలోని ఈజరపెట్రోల్ బంకు వద్ద బుధవారం మధ్యాహ్నం తమకు అందిన సమాచారం మేరకు స్థానిక ఎస్సై ఎస్. శ్రీనివాసరావు తన సిబ్బందితో పాటు డిప్యూటీ తాసిల్దార్ సమక్షంలో వాహన తనిఖీలు నిర్వహించారు. నలుగురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రెండు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నలుగురిలో గగులోతు. సురేష్ ,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ,తుంగారం మండలం, టేకుల బంజారా గ్రామానికి చెందిన వ్యక్తి , వినగడపగ్రామానికి చెందిన గడ్డం. రవి కిషోర్ ,తోటమాల కి చెందిన వేమిరెడ్డి. దుర్గాప్రసాద్ రెడ్డి, తోట మూల గ్రామానికి చెందిన దేవ బత్తిని. ప్రీతం కుమార్ ఒక్కొక్కరి వద్ద అరకిలో గంజాయి చొప్పున మొత్తం రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని, రెండు బైకులను కూడా సీజ్ చేశారు. కేసు నమోదు చేసి తిరువూరు సిఐ కే. గిరిబాబు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రయాణికులతో మర్యాదగా వ్యవహరించాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : విధి నిర్వహణలో టికెట్ ట్రావెలింగ్ ఎగ్జామినర్ల (టీటీఈలు) ప్రయాణికులతో మర్యాద పూర్వకంగా ఉంటూ వారి సమస్యలను పరిష్కరించటానికి కృషి చేసి రైల్వేల ప్రతిష్ఠను పెంచాలని విజయవాడ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ (సీనియర్ డీసీఎం) రాంబాబు వావిలపల్లి సూచించారు.సీనియర్ డీసీఎం నేతృత్వంలో బుధవారం డిఆర్ఎం కాన్ఫరెన్స్ హాల్‌లో టికెట్ తనిఖీ సిబ్బంది పనితీరుపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో డివిజన్ అంతటా ఉన్న స్క్వాడ్ ఇన్‌ఛార్జ్‌లు సౌకర్యాల సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీటీఈలు భారతీయ రైల్వేల ముఖం. మీ వృత్తి నైపుణ్యం, ప్రవర్తన,శ్రద్ధ సంస్థపై నేరుగా ప్రతిబింబిస్తాయి అన్నారు.ప్రధానంగా కన్సెషన్ కోటా దుర్వినియోగం, టికెట్ పేరు మార్పు,ఐడి కార్డులు అందుబాటులో లేకపోవడం వంటి కేసులను అదుపు చేయకుండా చూసుకోవాలని, సిబ్బంది తమ విధుల్లో జాగ్రత్తగా ఉండాలని కోరారు. రోజువారీ పనిలో నిఘా,క్షుణ్ణంగా తనిఖీ చేయడం ముఖ్యమైన అంశాలుగా ఆయన వివరించారు. పనితీరు లోపాలను సమీక్షించడానికి, అంతరాలను గుర్తించడానికి, ఆచరణాత్మక మెరుగుదలలను సూచించడానికి ఈ సమావేశం ఒక వేదికగా కూడా పనిచేసింది. ప్రయాణీకులకు సంబంధించిన సమస్యలతో పాటు వ్యక్తిగత, వృత్తిపరమైన ఆందోళనలను వెంటనే పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు.వ్యక్తిగత,ప్రజా ప్రవర్తనలో టిటిఈ లు ఆదర్శంగా ఉండాలని కోరారు. వృత్తి నైపుణ్యం మన ముఖ్య లక్షణంగా ఉండాలి. ప్రయాణీకులకు సానుకూల అనుభవాన్ని నిర్ధారించడంలో మీలో ప్రతి ఒక్కరూ కీలక పాత్ర పోషిస్తారు అని అన్నారు.అనంతరంఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో అత్యుత్తమ సేవలు చేసిన వారిని సత్కరించడంతో పాటు ఉత్తమ పనితీరు కనబరిచిన సేవలకు గుర్తింపుగా ప్రశంసా పత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ బివిఎన్ఎస్ రవి ప్రసాద్,పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ నుస్రత్ ఎం మాండ్రూప్కర్ పాల్గొన్నారు.

తృప్తికాంటీన్‌కు రుణ మంజూరు లేఖ అందజేత

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నెల్లూరులో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఆధ్వర్యంలో ప్రయోగాత్మకంగా ప్రారంభించిన తృప్తి క్యాంటీన్‌కు ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోందని విశాఖపట్నం, విజయవాడలో మరో నాలుగు క్యాంటీన్లు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు మెప్మా మిషన్ డైరెక్టర్ ఎన్.తేజ్ భరత్ తెలిపారు. అందులో భాగంగా గురువారం పంజా సెంటర్ వద్దగల షాది ఖానా దగ్గర తృప్తి క్యాంటీన్ ఏర్పాటుకు బుధవారం స్వయం సహాయక బృందాల లబ్ధిదారులకు రుణ మంజూరు లేఖను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడలో 4 క్యాంటీన్లను త్వరలో ఏర్పాటు చేయనున్నామని, ఇందుకు సంబంధించి కంటెయినర్ల సమీకరణ, కిచెన్ ఎక్విప్మెంట్ మొదలగు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఒక్కో క్యాంటీన్ ఏర్పాటుకు రూ.14.51లక్షల అంచనాతో జనసమ్మర్థం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో నగరపాలక సంస్థకు చెందిన ఖాళీ స్థలంలో స్వయం సహాయక సంఘాల సభ్యుల ద్వారా వీటిని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. భారత ఓవర్సీస్ బ్యాంక్ విజయవాడ ప్రాంతీయ కార్యాలయం ద్వారా తృప్తి క్యాంటీన్‌ను ఎస్‌హెచ్‌జీ మహిళా లబ్దిదారులకు రుణ మంజూరు లేఖల పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ యూసీడీ పీవో పి.వెంకటనారాయణ, ఐఓబీ, మెప్మా అధికారులు పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలతో ప్రమాదాలు నివారించవచ్చు

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : ముందస్తు జాగ్రత్త చర్యలతో అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని జిల్లా ఫైర్ ఆఫీసర్ మల్యాద్రి అన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యల్లో భాగంగా స్థానిక ఎంజీ రోడ్‌లోని స్వగృహ ఫుడ్స్, మెట్రో షూ షో రూమ్, వర్తక భవనం, మర్కంటైల్ భవనాన్ని వీఎంసీ ఫైర్ అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. అగ్ని ప్రమాదం జరగకుండా కాంప్లెక్స్ చుట్టూ ఫైర్ సేఫ్టీ మెజర్స్ ఏమేం ఉండాలి వంటి విషయాలపై వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వీఎంసీ ఫైర్ అధికారులు, సిబ్బంది, ఆయా సంస్థల నిర్వాహకులు పాల్గొన్నారు.

నేటి నుంచి కూడేరు లో వారాహి గుప్త నవరాత్రులు

విశాలాంధ్ర-పమిడిముక్కల: కూడేరు గ్రామం లో కావూరి వారి ఇలవేల్పు శ్రీ ఆదిలక్ష్మి కామేశ్వరి అమ్మవారి ఆలయంలో జూన్ 26 నుంచి జూలై 4వ తేదీ వరకు వారాహి గుప్త నవరాత్రులు జరుపుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు ఈ సందర్భంగా అమ్మవారి వంశస్థులు భక్తులు నవరాత్రులు లో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు.

గుర్రపుడెక్క తొలగింపునకు చర్యలు

విశాలాంధ్ర-పెడన: గుర్రపు డెక్క తొలగింపు చర్యలకు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు బుధవారం పెడన మండలం నందిగామ పంచాయతీ దావోజి పాలెం లో పరకోడు నుంచి భూదేవి వరకు ఉన్న 2 కిలోమీటర్ల మురుగు కాలవలో పేరుకుపోయిన కిక్కిస, జమ్ము, గుర్రపు డెక్క పనులను పెడన జడ్పిటిసి అర్జా వెంకట్ నగేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పెడన మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు శలపాటి. వీర ప్రసాద్, ప్రధాన కార్యదర్శి శ్రీరం. ప్రసాద్, ఉప సర్పంచ్ కాగిత లక్ష్మీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి : ఎస్ఐ నరేష్

విశాలాంధ్ర-నందిగామ: ట్రాఫిక్ రూల్స్ ను ప్రతి ఒక్కరు తప్పక పాటించాలని ఎస్సై నరేష్ అన్నారు బుధవారం స్థానిక వై జంక్షన్ వద్ద వాహనాలను ట్రాఫిక్ ఎస్ఐ తన సిబ్బందితో కలిసి తనిఖీలు చేశారు. ఆయన మాట్లాడుతూ వాహనదారులు సరైన ధృవీకరణ పత్రాలు కలిగి ఉండాలని, మైనర్లకు వాహనాలను తల్లిదండ్రులు ఇవ్వవద్దని అన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వారిపై చర్యలు ఉంటాయని అన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని కోరారు.హెల్మెట్ ధరించడం వల్ల రోడ్డు ప్రమాదలు జరిగినప్పుడు ప్రాణ నష్టం లేకుండా కాపాడుతుందని తెలిపారు. యువతలో మార్పు రావాలని,చాలామంది మొబైల్ మాట్లాడుతూ, ఫోన్లో పాటలు వింటూ,డ్రైవింగ్ చేస్తున్నారని,అలా చేస్తే మీరు ప్రమాద బారిన పడినట్లే అన్నారు. ఈ తనిఖీలలో ఏఎస్ఐ శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు.

పెనుమల్లిలో 'పొలం పిలుస్తోంది'

విశాలాంధ్ర-పెడన : మండల పరిధిలోని పెనుమల్లి గ్రామంలో స్థానిక రైతు సేవ కేంద్రం వద్ద రైతుల పొలాలకు క్షేత్ర సందర్శనతో పాటు రైతుల పొలాల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించేందుకు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి సజ్జ జెన్నీ మరియు గ్రామ రెవెన్యూ అధికారితో నిర్వహించారు. స్థానిక రైతులతో కలిసి పొలాలను పరిశీలించిన అనంతరం గ్రామంలోని ప్రజలతో స్థానిక పెనుమల్లి గ్రామం రైతు సేవ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రైతులు పంటలు వేసుకుని మొదలు పంట నూర్పులు చేసేంతవరకు ఎప్పటికప్పుడు స్థానిక వ్యవసాయ అధికారుల సలహాలు సూచనలు తీసుకొని అధిక దిగుబడులు సాధించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. వారంలో ప్రతి మంగళ,బుధవారాలలో ప్రతి గ్రామంలో పొలాలను సందర్శించి రైతులకు యజమాన్య పద్ధతుల గురించి వివరిస్తామని అన్నారు.

కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర-గుడివాడ : స్థానిక 15వ వార్డు బాపూజీ నగర్‌కు చెందిన కిలపర్తి దినేష్‌బాబు ఇటీవల బైక్ ప్రమాదంలో మరణించారు. ఆ కార్మికుని కుటుంబానికి ది గుడివాడ ఇండస్ట్రియల్ అండ్ ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ నాయకులు బుధవారం రూ.10వేల ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షులు టి.లక్ష్మణరావు, అధ్యక్షులు అబ్దుల్ హమీద్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ కుద్దుస్, నాయకులు షేక్ మొహిద్దిన్‌భాషా, కల్వకుంట నాగరాజు, ఎండి రషీద్ బేగ్, మదిరి శ్యాంకుమార్‌రెడ్డి, నాగరాజు, అన్నమనేడి వెంకటరమణ, బొంతు సోమేశ్వరరావులు పాల్గొన్నారు.

అక్రమ తవ్వకాలు చేస్తే చర్యలు : తహాశీల్దార్ మస్తాన్

విశాలాంధ్ర-కూచిపూడి :- అక్రమ తవ్వకాలు చేపడితే చర్యలు ఉంటాయని, కాల్వపై తవ్వకాలు చేపట్టి మట్టి తరలించిన వారిపై చర్యలకు కూచిపూడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తహసిల్దార్ కే మస్తాన్ తెలిపారు. వీరంకి లాకు సెక్షన్ నీటిపారుదల శాఖ పరిధిలోని మొవ్వ మండలం గూడపాడు గ్రామం వద్ద గూడపాడు బ్రాంచ్ ఛానల్ కాల్వ మట్టి తవ్వి తరలించిన ప్రదేశాన్ని బుధవారం తహసిల్దార్ కే మస్తాన్, మండల సర్వేయర్ ఏ కిషోర్ సిబ్బందితో పరిశీలించారు. ఆ శాఖ సహాయ కార్యనిర్వాహక ఇంజనీర్ టి వీరాంజనేయులు మొవ్వ

తవ్వకాలు చేపట్టిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న తహసిల్దార్

తహసిల్దార్ కే.మస్తాన్‌ను కోరుతూ ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే.... గూడపాడు బ్రాంచ్ చివర ఎడమ కట్టపై ఉప్పల కృష్ణమూర్తి కుమారులైన ఉప్పల బసవేశ్వరరావు, వెంకటేశ్వరరావు మురళీకృష్ణ, జనార్ధన రావులు కాలువ కట్టను ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అనుమతులు లేకుండా 35 అడుగుల వెడల్పు గల గట్టును సుమారు 20 అడుగుల వరకు తవ్వి వారి పొలాలలో ఆ స్థలాన్ని కలుపుకున్నారని ఫిర్యాదు మేరకు తనిఖీలు చేసి కూచిపూడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తహశీల్దార్ తెలిపారు. కూచిపూడి ఎస్ఐ కేవీఎన్ విశ్వనాథ్ మాట్లాడుతూ తహశీల్దార్ ఫిర్యాదుపై పూర్తిస్థాయి దర్యాప్తు చేపట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విద్యార్థులకు విద్యా సామాగ్రి వితరణ

విశాలాంధ్ర-పమిడిముక్కల: పెనుమత్స లోని ఎంపీయూపీ పాఠశాల విద్యార్థులకు విద్యా సామాగ్రిని దాత మొవ్వ పూర్ణచంద్రరావు (ఎన్ఆర్ఐ) వితరణ చేసినట్లు హెచ్ఎం ఎస్.ఫణికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన్మభూమిపై మమకారంతో సేవా కార్యక్రమాలు చేస్తూ దానిలో భాగంగా విద్యార్థులకు నోట్ పుస్తకాలు డైరీలు కాపీ పుస్తకాలు పంపిణీ చేశారన్నారు. దాత పూర్ణచంద్రరావు మాట్లాడుతూ విద్యార్థులు మంచి గా చదువుకుని గ్రామానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మొవ్వ రాము, వేణుగోపాల రావు పాగోలు కుమార్ నాగరాజు నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత పౌరులుగా ఎదగండి

విశాలాంధ్ర, ఉయ్యూరు : ప్రభుత్వం కల్పించే సౌకర్యాలను సమర్థవంతంగా వినియోగించుకొని ఉన్నత పౌరులుగా ఎదగాలని ఎంపీడీఓ జీవీఎస్‌వి శేషగిరి సూచించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్స్ పంపిణీ లో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం స్కూల్ బ్యాగ్ మరియు బూట్లు పంపిణీ చేసినారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు టీవీ నాగేశ్వరావు మాట్లాడుతూ అందరూ ఒకే రకమైన యూనిఫాం ధరించుట వలన విద్యార్థుల్లో సమానత్వం సోదర భావం ఆత్మ స్థైర్యం పెంపొందుతాయి అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు బాలు, లాలు, పెరుమాళ్ళు పాల్గొన్నారు.

సర్వేయర్ల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర, కూచిపూడి : సర్వేయర్లను జనాభా పెరుగు కాకుండా రెవెన్యూ విలేజ్ ప్రకారంహేతుబద్దీకరణ చేయాలని మొవ్వ మండలంలోని సచివాలయ గ సర్వేయర్లు తహశీల్దార్ కే మస్తాన్‌కు వినతిపత్రం అందజేశారు. విలేజ్ సర్వేయర్ల సీనియార్టీ లిస్టులో విడుదల చేయాలని విలేజ్ సర్వేయర్లు ప్రమోషన్ ఛానల్ గురించి గ్రేడ్ వన్ ప్రమోషన్ గురించి, ట్రాన్స్ఫర్‌లో సొంత మండలంలో పోస్టింగ్ ఇవ్వాలని, తదితర సమస్యల అంశాలపై వినతిపత్రాన్ని ఇచ్చారు. మండల సర్వేయర్ ఏ కిషోర్ బాబు కూడా వారు వినతి పత్రాన్ని అందజేశారు.

నేడు ఎమ్మెల్యే బోడే ప్రజా దర్బార్

విశాలాంధ్ర-ఉయ్యూరు : పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ గురువారం మండలంలోని బోళ్లపాడు ముదునూరు గ్రామాల్లో ప్రజా దర్బార్ నిర్వహించనున్నారు. బోళ్లపాడు గ్రామంలోని మధ్యాహ్నం ముదునూరులోని ప్రజా దర్బార్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఎంపీడీఓ జీవీస్వీ శేషగిరిరావు తెలిపారు.

బోర్లను ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ

విశాలాంధ్ర నందిగామ : పట్టణంలో నీటి ఎద్దడి లేకుండా చూడటమే ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి అన్నారు బుధవారం పట్టణంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆదేశానుసారం పట్టణంలోని 11వ వార్డు, చాపల మార్కెట్ వద్ద బోర్లను మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో నందిగామ పట్టణం అభివృద్ధి వైపు పరుగులు పెడుతుందని రాష్ట్ర ఆర్థిక పరిస్థితి లోటు లో ఉన్న ఎమ్మెల్యే చొరవతో కూటమి ప్రభుత్వం అసాధ్యాన్ని సైతం సుసాధ్యం చేస్తుందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వివిధ హోదాలో ఉన్న టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గుప్తాకు చవరాన్ అవార్డు

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : లయ నిజంలో మూడున్నర దశాబ్దాలకు పైబడి వివిధ పదవులు ద్వారా అనేక సేవా కార్యక్రమాలలో పాల్గొంటున్న ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ వేముల హజరత్తయ్య గుప్తాకు లయన్స్ అంతర్జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పట్టి హిల్ ప్రశంసాపత్రం, చవరాన్ అవార్డు, బాడ్జీని పంపగా వాటిని లయన్స్ జిల్లా గవర్నర్ గద్దె శేషగిరి అందచేశారు. గుప్తా బహుముఖ ప్రజ్ఞతో అనేక అవార్డులు, ప్రశంసలు అందుకుని మంచి వ్యాఖ్యాతగా కూడా గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. జిల్లా పూర్వ గవర్నర్ టి. దుర్గామల్లేశ్వరరావు మాట్లాడుతూ గుప్తాకు సరస్వతీ దేవి కటాక్షం మెండుగా ఉందన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ అధ్యక్ష కార్యదర్శులు రామకృష్ణ, రవీంద్రలు హజరత్తయ్య గుప్తాను అభినందించారు.

కేంద్రీయ విశ్వవిద్యాలయాలను పూర్తి చేయాలి : కమిషనర్

విశాలాంధ్ర-నందిగామ: కేంద్రీయ విద్యాలయాలను పూర్తి చేయాలని, ప్రభుత్వం అందించిన ఆదేశాల మేరకు నందిగామ పురపాలక సంఘ పరిధిలోని తాత్కాలికముగా కేంద్రీయ విద్యాలయం మహిళా పాలిటెక్నిక్ ట్రైనింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ లోవ రాజు అన్నారు. బుధవారం మునిసిపల్ కమిషనర్ క్షేత్ర స్థాయి పర్యటనలో ప్రస్తుత పరిస్థితిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె.ఫణి శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి వృద్ధులకు రేషన్ సరుకులు పంపిణీ

విశాలాంధ్ర-పెడన : ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు రాష్ట్రవ్యాప్తంగా వృద్ధులకు వికలాంగులకు 5 రోజుల ముందుగానే రేషన్ ఇంటి వద్దనే అందించాలని పెడన మండల తహసీల్దార్ కూనపురెడ్డి అనిల్ కుమార్ అన్నారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో 65 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు ఈనెల 26వ తేదీ గురువారం నుండి ఇంటి వద్దకే వెళ్లి రేషన్ సరుకులు అందించాలని డీలర్లకు ఆదేశాలు జారీ చేశారు. 1 తేదీ నుండి రేషన్ ఇస్తున్నప్పటికీ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 5 రోజులు ముందుగా వృద్ధులు, వికలాంగులకు వారి ఇళ్లకు వెళ్లి రేషన్ అందించాలన్నారు. ఈ సమావేశంలో ఆర్ ఐ. ఈడే విజయలక్ష్మి, విఆర్ఓ కృపావరం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నాగాయలంక తహశీల్దార్‌కి కోడూరు తహశీల్దార్‌గా అదనపు బాధ్యతలు

విశాలాంధ్ర-కోడూరు : నాగాయలంక తహసీల్దార్ గా పనిచేస్తున్న సిహెచ్. వీరాంజనేయ ప్రసాద్ బుధవారం కోడూరు మండల తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వీరాంజనేయ ప్రసాద్‌ను కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్ఛం అందజేశారు. డిప్యూటీ తహసీల్దార్ సౌజన్య కిరణ్మకి, సీనియర్ అసిస్టెంట్ సరళ, రెవెన్యూ ఇన్స్పెక్టర్ సుభాషిణి, విఆర్ఓలు, విఆర్ఏలు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు రెడ్ క్రాస్ సాయం

విశాలాంధ్ర-చల్లపల్లి : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సేవలు అభినందనీయం అని చల్లపల్లి మండల ఎంఆర్ఐ ఘంటసాల కృష్ణమోహన్ అన్నారు. బుధవారం చల్లపల్లి మండలం వెలివోలు ఎస్సీ కాలనీలో అగ్ని ప్రమాద బాధితురాలు కొడాలి ఝాన్సీకి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సహాయం అందచేశారు. రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ వారి సహకారంతో స్టీల్ సామాగ్రి సెట్, హెవీ టార్పాలిన్ అందచేశారు. చల్లపల్లి సబ్ బ్రాంచ్ ద్వారా నిత్యావసర సరుకులు, బియ్యం, దుప్పట్లు, చీర అందచేశారు. సీనియర్ జర్నలిస్ట్ కుంపటి బాబూరావు రెండు చీరలు అందచేశారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చల్లపల్లి సబ్ బ్రాంచ్ చైర్మన్ నడకుదురు లీలా బ్రహ్మేంద్ర ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్లు పేరం మధుసూదనరెడ్డి, ఆకురాతి హరిప్రసాద్, ట్రెజరర్ ఎండీ.ఏ.కే.జిలాని, బళ్ల మధుసూదనరావు, కావూరి సల్మాన్ రాజు పాల్గొన్నారు.

సీపీఐ పెద్ద అవుటపల్లి గ్రామ కార్యదర్శిగా సాంబయ్య

విశాలాంధ్ర-గన్నవరం : ఉంగుటూరు మండలం పెద్ద అవుటపల్లి గ్రామ శాఖ మహాసభ మంచికంటి సాంబయ్య ఇంటిదగ్గర అవుటుపల్లి రాఘవులు అధ్యక్షతన నిర్వహించారు. గ్రామ శాఖ కార్యదర్శిగా మంచికంటి సాంబయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కార్యదర్శి సాంబయ్య మాట్లాడుతూ పెద్ద అవుటుపల్లి గ్రామంలో కమ్యూనిస్టుపార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.

కోమటికుంటలో విద్యుత్ కష్టాలు

విశాలాంధ్ర-ఏ కొండూరు : రామచంద్రపురం పంచాయతీ పరిధిలోని కోమటికుంటలో మూడు నెలలుగా కరెంట్ కష్టాలు పగలు రాత్రి తేడా లేకుండా వేధిస్తున్నాయని గ్రామస్తులు గగ్గోలు పెడుతున్నారు. కోమటికుట గ్రామస్తుల నుండి సేకరించిన వివరాల ప్రకారం చిన్న గాలి వచ్చిన ఆకాశం నుండి చినుకు చిటుక్కు మన్న కరెంట్ ను గంటల తరబడి విద్యుత్ అధికారులు తీసివేస్తున్నారని గ్రామస్తులు చెపుతున్న మాట. రోజు మొత్తం మీద 7 గంటల నుండి 8 గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా జరుగుతుందని అని ఆ తర్వాత విద్యుత్ రావడం పోవడం జరుగుతూ ఉంటుంది అని గ్రామస్తులు తమ గోడును వెళ్ళ బోసుకుంటున్నారు. వర్షాకాలం కావడంతో దోమల బెడద ఎక్కువగా ఉంటుందని, అర్ధరాత్రి అపరాత్రి అనే తేడా లేకుండా విద్యుత్‌ను ఏ సమయంలో పడితే అసమయంలో తీసివేస్తున్నారని గ్రామస్తులు అంటున్నారు. విద్యుత్ శాఖ ఉన్నత అధికారులు సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పార్టీకోసం పనిచేసే వాళ్లకే పట్టం: దేవినేని

విశాలాంధ్ర-పెదపారుపూడి: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ నందమూరి తారక రామారావు జన్మస్థలం పామర్రు నియోజకవర్గంలో, పెదపారుపూడి మండలం టిడిపి అధ్యక్షుడిగా చలసాని రమేష్ చౌదరి, ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబు ఫుల్ టైం పార్టీ కోసం పనిచేసి అధికారం లేకపోయినా అధికారం కోసం శ్రమించిన వ్యక్తులుగా మళ్లీ వాళ్లనే మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులుగా మండల టిడిపి శ్రేణులు ఏకకంఠంతో ఏకగ్రీవంగా ఆమోదించటం అభినందించదగ్గ విషయమని కంకిపాడు సాగునీటి సంఘం డిస్ట్రిబ్యూషన్ కమిటీ(డిసి) చైర్మన్, పెదపారుపూడి మండల సంస్థాగత ఎన్నికల పరిశీలకులు దేవినేని రత్న భూషణ్ అన్నారు. మండల అధ్యక్ష కార్యదర్శులను టిడిపి పెద్దలు శాలువాలతో పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నేత సూరపనేని వెంకట సత్యనారాయణ, టిడిపి నియోజక వర్గ పరిశీలకులు కోట వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

విశాలాంధ్ర, కూచిపూడి : మొవ్వమండలం భట్లపెనుమర్రు ఎంపీ ఎలిమెంటరీ స్కూల్లో 30 వేల రూపాయల విలువ గల నోట్ పుస్తకాలు, స్టేషనరీను బుధవారం ఆ గ్రామానికి చెందిన చలసాని నీరజ జ్ఞాపకార్థం ఆమె భర్త చలసాని భాస్కరరావు (నాని) బహుకరించారు పాఠశాలలో చదువుకుంటున్న 52 మంది విద్యార్థులకు అందజేసిన ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి మురళి గోపాలకృష్ణ, ఉపాధ్యాయులు ఎం శ్రీనివాసరావు, జె ఏసు, టి నాగలక్ష్మి లతోపాటు గ్రామస్తులు సిబ్బంది పాల్గొన్నారు.

విత్తన దుకాణాలు తనిఖీ

విశాలాంధ్ర - దాచేపల్లి : ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ఆరంభమవుతున్న నేపధ్యంలో వ్యవసాయ శాఖ అప్రమత్తమైంది. దీనిలో భాగంగానే దాచేపల్లిలోని కొట్ల బజారులో ఉన్న విత్తన దుకాణాలను బుధవారం స్థానిక ఏఓ కంచర్ల వెంకటేష్ సందర్శించారు. వాటిలో బిల్లు పుస్తకాలు, స్టాకు రిజిస్టర్లు, కంపెనీలకు చెందిన ప్రిన్సిపుల్ సర్టిఫికెట్లను పరిశీలించారు. విత్తనాలు కొనుగోలు చేసి తగిన బిల్లులు కూడా తీసుకోవాలని రైతులకు ఆయన సూచించారు. అన్ని రకాల అనుమతులు కలిగిన దుకాణాల్లో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని కోరారు.

ఎరువుల డీలర్లకు ఈ-పాస్ మిషన్ల అందజేత

విశాలాంధ్ర - మాచర్ల : డీలర్లు సర్టిఫైడ్ ఎరువులను మాత్రమే రైతులకు అమ్మకాలు జరపాలని ఏడీఏ జగదీశ్వర్ రెడ్డి సూచించారు. బుధవారం పట్టణంలోని రామాలయంలో సబ్ డివి జన్ పరిధిలోని ఎరువుల డీలర్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఏడీఏ జగదీశ్వర్ రెడ్డి మాట్లా డుతూ ఎమ్మార్పీ ధరలకు మించి ఎరువులను అమ్మకాలు జరపరాద న్నారు. ఈ సందర్భంగా డీలర్లకు ఈ-పాస్ మిషన్లను ఇచ్చినట్టు తెలి పారు. రైతులకు ఎరువులను అమ్మిన వెంటనే ఈ-పాస్ మిషన్లో సేల్ ను ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. డీలర్లు ప్రభుత్వ నిబం ధనలను అతిక్రమించరాదన్నారు. సమావేశంలో ఏవోలు డి.పాపకు మారి, వై.పుల్లారెడ్డి, టి.బాలాజీ, గంగాధర్, గురజాల, రెంటచింతల, మాచర్ల, దుర్గి, వెల్దుర్తి మండలాల డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

పసుమర్రు మహిళ వినియోగదారుల విజయంపై హర్షం

విశాలాంధ్ర - చిలకలూరిపేట : మండలంలోని పసుమర్రు గ్రామానికి చెందిన పి.మరియమ్మ అనే మహిళ వినియోగదారుల కోర్టులో విజయం సాధించడం పట్ల పల్నాడు జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షుడు మురికిపూడి ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పసుమర్రు గ్రామానికి చెందిన పచ్చిక్కల మరియమ్మ అనే మహిళకు పసుమర్రు యూనియన్ బ్యాంకులో ఖాతా కలదు. రూ.16,500 పొదుపు చేసుకుంది. కాగా ఆమెకు తెలియకుండా ఆమె సొమ్ము రూ..16,500 వేరొకరి ఖాతాకు యూనియన్ బ్యాంకు సిబ్బంది ట్రాన్స్‌ఫర్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఆమె బ్యాంకు అధికారులను సంప్రదించారు. అయినా ఆమెకు సరిగ్గా సమాధానం చెప్పకపోవడంతో ఆమె బ్యాంకింగ్ అంబుడ్స్‌మెన్‌కు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపిన బ్యాంకింగ్ అంబుడ్స్‌మెన్ రూ.16,500లు తిరిగి ఆమె ఖాతాకు జమ చేయాలని బ్యాంక్ అధికారులు ఆదేశించడం జరిగింది. ఇదే సమయంలో మనోవేదనకు గురైన మహిళ ఈ విషయాన్ని న్యాయవాది గుదే రవితేజ ద్వారా వినియోగదారుల కోర్టులో ఫిర్యాదు చేశారు. కేసు పూర్వాపరాలు విచారించిన న్యాయమూర్తి ఖాతాదారు డబ్బులు ఆమె తెలియకుండా క్యాష్ ట్రాన్స్‌ఫర్ చేయడం సేవా లోపమని, మానసికంగా ఇబ్బందిపెట్టిన పసుమర్ యూనియన్ బ్యాంకుకు రూ.7 వేలు పెనాల్టీగా ఆమెకు చెల్లించాలని రూ.2 వేలు కోర్టు ఖర్చులకు చెల్లించాలని ఆదేశించారని ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా తనకు జరిగిన అన్యాయానికి పోరాటం చేసిన మహిళను గౌరవ న్యాయవాది గుదే రవితేజను వినియోగదారుల సంఘం పల్నాడు జిల్లా కార్యవర్గ సభ్యులు డాక్టర్ విద్య సాగర్, రవి నాయక్, బేబీ విక్రమ్, గాలయ్య అభినందించారు.

నేడు 'అంతర్జాతీయ మాదక ద్రవ్య దుర్వినియోగంపై చర్చ

విశాలాంధ్ర - గుంటూరు వైద్యం : 'అంతర్జాతీయ మాదక ద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక రామన్నపేటలోని జనచైతన్య వేదిక హాలు నందు గురువారం ఉదయం 9 గంటలకు చర్చా గోష్ఠిని నిర్వహిస్తున్నట్లు జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ ఐపీఎస్ అధికారి మండవ విష్ణు వర్ధనరావు, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కోశాధికారి పి.రామచంద్ర రాజు, ప్రముఖ విద్యావేత్త కన్న మాష్టర్లు ఈ చర్చా గోష్టిలో పాల్గొని మాట్లాడతారు. ఆంధ్రప్రదేశ్ లో మాదక ద్రవ్యాల నిర్మూలనకై కృషి చేస్తున్న ప్రజా సంఘాలు, మహిళా సంఘాలు, మేధావులు హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పట్టణ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి: ఎమ్మెల్యే జూలకంటి

విశాలాంధ్ర - వెల్దుర్తి : మాచర్ల పట్టణ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా అధికారులు, నాయకులు పనిచేయాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి సూచించారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, చైర్మన్ మదార్ సాహెబ్‌తో సమీక్ష నిర్వహించారు. పట్టణ మౌలిక వసతుల కల్పనకై మున్సిపల్ అధికారులు తయారు చేసిన ప్రణాళికలను ఎమ్మెల్యేకు కమిషన్ వేణుబాబు వివరించారు. ఈ సందర్భంగా పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో దాదాపు రూ.3 కోట్లతో నిర్మిస్తున్న సీసీ రోడ్లు, గ్రావెల్ రోడ్ల పనులు ఎంతవరకు వచ్చాయని ఎమ్మెల్యే ఆరా తీశారు. వీటి నిర్మాణాలకు త్వరగా టెండర్లకు పిలిచి పనులు ప్రారంభించాలని సూచించారు. పట్టణ శివారు ప్రాంతంలో రోడ్లు, తాగునీరు, లైటింగ్ వంటి మౌళిక సదుపాయాలపై నివేదిక తయారు చేసి, వారం రోజుల్లో అందజేయాలని ఆదేశించారు. పట్టణాభివృద్ధికి ఇంకా మరిన్ని గ్రాంట్లు ద్వారా నిధులు రానున్నాయని, ప్రజా సమస్యలను గుర్తించి, పనులకు సంబంధించిన నివేదికలను తయారు చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఇన్నర్‌వీల్ క్లబ్ చిలకలూరిపేటకు 24 అవార్డులు

విశాలాంధ్ర - చిలకలూరిపేట : స్నేహం, సేవ అనే దృక్పథంతో ఇన్నర్‌వీల్ క్లబ్ పనిచేస్తుందని, ఆ దిశగానే ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట అనేక సేవా కార్యక్రమాలు చేపట్టిందని క్లబ్ అధ్యక్షురాలు గట్టు సరోజిని అన్నారు. 2024-25 సంవత్సరానికి ఇన్నర్‌వీల్ ఆఫ్ చిలకలూరిపేటకు క్లబ్‌కి బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డ్, ఎక్స్‌లెంట్ సర్వీసు అవార్డ్‌తో పాటు మొత్తం 24 అవార్డ్స్ అందుకున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన రికగ్నైజేషన్ అవార్డ్స్ సెలబ్రేషన్ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ 315 చైర్మన్ ప్రేమలత చేతుల మీదుగా ఈ అవార్డులు పొందారు. సంవత్సరకాలంగా చేపట్టిన 103 వివిధ సేవా కార్యక్రమాలను గుర్తిస్తూ, అవార్డులతో పాటుగా ప్రశంసాపత్రాలను కూడా అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు గట్టు సరోజిని మాట్లాడుతూ సంవత్సరకాలంగా ఇన్నర్‌వీల్ క్లబ్ తరుపున విజయవాడ వరదల సమయంలో సాయం, విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలు, వృద్ధులకు చేయూత, బాలికా విద్యకు ప్రాధాన్యతనిస్తూ స్కాలర్‌షిప్‌ల అందజేత, ఉచిత వైద్య శిబిరాలు, ట్రైసైకిళ్ల పంపిణీ, కుట్టు శిక్షణ, కుట్టు మిషన్ల పంపిణీ, ట్రాన్స్‌జెండర్లకు చేయూత, పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం, ప్రభుత్వాసుపత్రిలో తాగునీటి సదుపాయం తదితర కార్యక్రమాలు నిర్వహించినట్లు వివరించారు. దాతలు, క్లబ్ సభ్యుల సహకారంతో ఈ కార్యక్రమాలను చేపట్టినట్లు వెల్లడించారు. తనతో పాటు అవార్డులను స్వీకరించటానికి డిస్ట్రిక్ట్ చైర్మన్ కోలా విజయలక్ష్మి, సెక్రటరీ జయలక్ష్మి హాజరైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు గట్టు సరోజినిని అభినందించారు.

వినుకొండ టౌన్, మండల పరిధిలోని ఏపీ మోడల్ స్కూల్ తనిఖీ

విశాలాంధ్ర - వినుకొండ : వినుకొండ టౌన్ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా వంటశాల పరిశీలించి, స్టాక్ రూముకు వెళ్లి స్టాక్ తనిఖీ చేశారు. విద్యార్థినులతో మాట్లాడి ఏమైనా లోటుపాట్లు గురించి అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు చేరాల్సినవి సక్రమంగా క్వాంటిటీ అండ్ క్వాలిటీ ప్రకారంగా చేరాలని హెచ్ఎం, మిడ్ డే మీల్ ఇన్చార్జిని ఆదేశించారు. చైర్మన్ తొలుతగా వినుకొండ పరిధిలోని చీకటి గలపాలెం గ్రామంలో ఏపీ మోడల్ స్కూల్ లో బుధవారం తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా వంటశాల పరిశీలించి అక్కడ మెనూ లో నాలుగు రకాల కూరగాయలు కర్రీ చేయాలి, బదులుగా దోసకాయలుతో కర్రీ చేస్తున్నారు. పిల్లలకి బుధవారం గుడ్లు ఎందుకు ఇవ్వలేదు అని ప్రిన్సిపాల్ ని నిలదీశారు. ప్రిన్సిపాల్ మాకు పై నుంచి గుడ్లు కాంట్రాక్టర్ గుడ్లు పంపించడం లేదని ప్రిన్సిపల్ జవాబు చెప్పడంతో, చైర్మన్ వెంటనే ఎగ్స్ కాంట్రాక్టర్ తో మాట్లాడి సరిగా నువ్వు సప్లై చెయ్యి అని హెచ్చరించారు. స్టోర్ రూమ్ పరిశీలించి విద్యార్థినులతో మాట్లాడి ఏమైనా లోటుపాట్లు గురించి అడిగి తెలుసుకున్నారు. వంట ఏజెన్సీ భోజనం, కర్రీ టెస్ట్‌గా చెయ్యడం లేదని చెప్పారు. పిల్లలకు చేరాల్సినవి సక్రమంగా క్వాంటిటీ అండ్ క్వాలిటీ ప్రకారంగా చేరాలని ప్రిన్సిపాల్ మరియు మిడ్ డే మీల్ ఇన్చార్జిని ఆదేశించారు.

జిమ్‌తో ఆరోగ్యం

విశాలాంధ్ర - వినుకొండ : పట్టణంలోని హైటెక్ జిమ్ నందు మానవ సేవ సమితి అధ్యక్షులు పీవీ సురేష్ బాబు జిమ్ కోచ్ అబ్దుల్లా జిమ్ సభ్యులు ఇటీవల కావలిలో జరిగిన బాడీ బిల్డింగ్ కాంపిటీషన్లో 5వ విజేతగా నిలిచిన చీమకుర్తి వీరాంజనేయులు అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా పివి సురేష్ బాబు మాట్లాడుతూ. యువత ప్రతి ఒక్కరూ యోగ మెడిటేషన్ జిమ్ తప్పనిసరిగా చేసి ఆరోగ్యవంతులుగా ఉండాలని, జిమ్ సభ్యులు ప్రజాహిత కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని, హైటెక్ జిమ్ ద్వారా వినుకొండ పట్టణానికి రాష్ట్ర, జాతీయ స్థాయిలో బాడీ బిల్డర్లను తయారుచేస్తూ క్రమశిక్షణ కలిగిన కోచ్‌గా గుర్తింపు పొందారు. ఈ కార్యక్రమంలో జిమ్ సభ్యులు పవన్ శ్రీను, చిన్న, మున్నా, అభి రెడ్డి, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలలో 'పొలం పిలుస్తుంది'

విశాలాంధ్ర - వినుకొండ : వినుకొండ మండలంలోని గోనుగుంట్ల వారిపాలెం మరియు హసన్నాయిని పాలెం గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులకు కౌలు రైతు కార్డులు గూర్చి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విఎఏ దుర్గా వరప్రసాద్, నాయక్, గ్రామసర్పంచ్, రైతు సోదరులు పాల్గొన్నారు.

గురుపౌర్ణమి మహోత్సవాలు

విశాలాంధ్ర - వినుకొండ : 34వ గురు పౌర్ణమి మహోత్సవాలు వినుకొండ బోసు బొమ్మ సెంటర్ లోని శ్రీ షిరిడి సాయిబాబా దేవస్థానంలో బుధవారం ఆలయం ఆవరణంలో రంగులతో భారీ వినాయకుడు అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం నాడు 11 వందల మామిడి పండ్లతో రాస్తానామ పూజ సాయినాధునికి నిర్వహిస్తున్నట్లు, ఈనెల 19వ తారీకు నుండి 29 ఆదివారం వరకు ప్రతిరోజు 11 గంటలకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారు మాట్లాడుతూ. శ్రీశ్రీశ్రీ శుద్ధ చైతన్యానంద స్వామి వారి శిష్య బృందం శంకర సత్సంగం మరియు మహిళ భక్తులచే గురువారం, ఆదివారం ఉదయం 6 గంటలకు, సాయంత్రం 9 గంటలకు అభిషేకములు ప్రతిరోజూ ఉదయం 11 గంటలకు శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం ఆలయ అధ్యక్షులు డి. ప్రసాద్, కొల్లిపర సుబ్రహ్మణ్యం, దోసపాటి బాబు, ఐటిసి బాబు, కార్యవర్గ సభ్యులు తాతా పాండురంగారావు, మోటమర్రి నాగేశ్వరరావు, పి.ప్రసాద్ రావు, ఆలయ ప్రధాన అర్చకులు పోతుకూచి శ్రీనివాస శాస్త్రి, తదితరులు పాల్గొని భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

అన్నవరం గ్రామంలో మలేరియా ర్యాలీ

విశాలాంధ్ర - రొంపిచర్ల : మండలంలోని అన్నవరం గ్రామంలో బుధవారం మలేరియా వారోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో 'దోమలు కుట్ట రాదు, దోమలు పుట్టరాదు' అని నినాదాలు చేశారు. అదేవిధంగా ఆ గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధుల గురించి, వాటి లక్షణాలు గురించి, నివారణ చర్యలు గురించి వివరించారు. అందరూ దోమ తెరలు వాడాలని అన్నారు. ఫ్రైడేను డ్రైడేగా పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ వెంకటేశ్వరరావు, సబ్ యూనిట్ ఆఫీసర్ కుంచాల శ్రీనివాసరావు, హెల్త్ సూపర్‌వైజర్ రామయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర

మానవత్వం చాటుకున్న మాదల చైతన్య

విశాలాంధ్ర - గుంటూరు వైద్యం : చదువుకు పేదరికం అడ్డం కాకూడదనే ఉద్దేశంతో నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించడం సంతోషంగా ఉందని జనచైతన్య ప్రాపర్టీస్ అధినేత మాదల చైతన్య అన్నారు. ఈ మేరకు బుధవారం జనచైతన్య ప్రాపర్టీస్ కార్యాలయంలో 20 మంది పాఠశాల, కళాశాలల నిరుపేద విద్యార్థులకు చెక్కులు పం పిణీ చేశారు. విద్యార్థుల పాఠశాల, కాలేజీ ఫీజులు, పాఠ్య పుస్తకాలకు అయ్యే ఖర్చులను మొత్తం మాదల చైతన్య విద్యార్థులకు అందించారు. మాదల చైతన్య మాట్లాడుతూ ఆర్థిక స్తోమత లేక చదువుకోలేని విద్యార్థినీ, విద్యార్థుల జీవి తాల్లో వెలుగులు నింపడానికి ప్రతి సంవత్సరం ఆర్థిక సహాయం చేస్తున్నట్లు తెలిపారు. సుమారు 20 లక్షల రూపాయలతో 20 మంది విద్యార్థులకు నేడు ఆర్థిక సహాయం అందించామన్నారు. విద్యార్థులు తమ ఉన్నత విద్యను మంచి లక్ష్యంతో క్రమశిక్షణతో పూర్తిచేసి కుటుంబానికి, సమాజానికి ఆదర్శంగా, నిలవాలని ఆకాంక్షించారు.

హార్వర్డ్ యూనివర్శిటీలో రీసెర్చ్ ఫెలోషిప్‌నకు భాష్యం పూర్వ విద్యార్థి

విశాలాంధ్ర - గుంటూరు సిటీ: భాష్యం విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ దేశ, విదేశాల్లో మన ఖ్యాతిని ఇనుమడింపజేయడం ఎంతో గర్వ కారణంగా ఉందని భాష్యం విద్యా సంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. భాష్యం పూర్వ విద్యార్థి లింగంశెట్టి షణ్ముఖ్ ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీలో ఒక సంవత్సరం పాటు రీసెర్చ్ ఫెలోషిప్‌నకు ఎంపిక కావడం పట్ల రామకృష్ణ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ బుధవారం మెయిన్ క్యాంపస్ లో షణ్ముఖ్ ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ షణ్ముఖ్ భాష్యం బ్లూమ్స్ లో 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు, ఇంటర్మీడియట్ బైపీసీ భాష్యం మెడెక్స్ లో అభ్యసించినట్లు చెప్పారు. ఎం.బి.బి.ఎస్ పూర్తి చేసిన షణ్ముఖ్ కార్డియాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ లపై చేసిన పరిశోధనలు 35 ఇంటర్నేషనల్ జర్నల్స్ లో ప్రచురితమయ్యాయి. అలాగే లండన్ లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో తన పరిశోధనల గురించి ఉత్తమ ప్రదర్శన ఇచ్చినందుకు తనకు ఈ అవకాశం దక్కిందన్నారు. షణ్ముఖ్ భవిష్యత్ లో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని రామకృష్ణ ఆకాంక్షించారు. కార్యక్రమంలో షణ్ముఖ్ తండ్రి నరేంద్ర, భాష్యం మెడెక్స్ ప్రిన్సిపాల్ హరిబాబు పాల్గొన్నారు.

ఉప్పలపాడు పంచాయతీని సందర్శించిన డీఎల్‌పీఓ

విశాలాంధ్ర-పెదకాకాని : మండల పరిధిలోని ఉప్పలపాడు పంచాయతీ కార్యాలయాన్ని బుధవారం డివిజనల్ పంచాయతీ అధికారి కె. శ్రీనివాసరావు సందర్శించారు. ఆఫీసులోని పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఒక వారంలో డిప్యూటీ కమిషనర్ మండలంలోని ఏదో ఒక పంచాయతీని సందర్శించే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆయా గ్రామ పంచాయతీల్లోని రికార్డులు ఎలా ఉన్నాయి పరిశీలించడానికి ఈ పంచాయతీని సందర్శించానని ఆయన తెలియజేశారు.

సింగయ్య కుటుంబానికి న్యాయం చేయాలి

- తెలుగు రైతు జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి కళ్ళం బాపిరెడ్డి

విశాలాంధ్ర - తాడేపల్లి : సింగయ్య కుటుంబానికి న్యాయం చేయాలని తెలుగు రైతు జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి కళ్ళం బాపిరెడ్డి అన్నారు. సింగయ్య మృతి ముమ్మాటికి జగన్ నిర్లక్ష్యమే కారణమన్నారు. బుధవారం తాడేపల్లి బైపాస్ రోడ్డులోని వారి నివాసంలో మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి సింగయ్య కుటుంబాన్ని ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా జగన్‌మోహన్ రెడ్డి సింగయ్య కుటుంబానికి రూ.10 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సింగయ్యకి ప్రమాదం జరిగిన సమయంలో జగన్ కారులో ఉన్న అందరినీ విచారణకు పిలవాలని ఏపీ ప్రభుత్వాన్ని కోరారు. తక్షణమే సింగయ్య కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

నేటి నుంచి నట్టల నివారణ కార్యక్రమం

విశాలాంధ్ర - తాడికొండ : గొర్రెలు, మేకలలో నట్టల నివారణ కార్యక్రమాన్ని నేటి నుంచి జూలై 10వ తేదీ వరకు కొనసాగిస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ ఏడీ వై.రాయపరెడ్డి బుధవారం తెలిపారు. నియోజకవర్గంలోని ఆయా గ్రామాలలో ఉన్న పశు వైద్యశాలలో నట్టల నివారణకు ఉచితంగా మందులు వేయబడతాయని తెలిపారు. నట్టల నివారణతో గొర్రెలు, మేకలు, పశువులు ఆరోగ్యంగా ఉంటాయని తెలియజేశారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రేపు సీడీఎంఏ కార్యాలయం ముట్టడి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : రాష్ట్రంలోని నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాలలో ఇంజనీరింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులకు సంబంధించి 50 రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం చర్చలకు పిలవకుండా తాత్సారం చేయడంతో ఈ నెల 27వ తేదిన వడ్డేశ్వరంలోని సీడీఎంఏ కార్యాలయ ముట్టడికి పిలుపునిస్తున్నట్లు కార్మిక సంఘాల జేఏసీ ఛైర్మన్ ఈదులమూడి మధుబాబు తెలిపారు. తమ డిమాండ్ల సాధన కోసం గుం టూరు నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద మూడవ రోజు బుధవారం కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మధుబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వం పారిశుద్ధ కార్మికులకు, అప్పుడు ఉన్న జీతంపై రూ.6 వేలు పెంచుతూ ఉత్తర్వులు ఇచ్చిందో అదే రూ.6 వేలను ఇంజనీరింగ్ విభాగంలోని మిగిలిన ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, మున్సిపల్ రంగంలోని కార్మికులను హెచ్‌ఆర్ పాలసీ విధానంలోకి తీసుకురావాలని, మినిమం టైమ్ స్కేల్ ఇవ్వాలని, ఇంక్రిమెంట్‌లు ఇస్తూ జీతాలు పెంచాలని, ఆప్కాస్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పదవీ విరమణ వయస్సు 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇచ్చిన ఉత్తర్వుల్లాగా మున్సిపల్ రంగంలోని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ గ్రాడ్యుటీ ఇచ్చే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వాలని, పదవీ విరమణ చెందిన వెంటనే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రూ.5 లక్షలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సీడీఎంఏ కార్యాలయ ముట్టడితోనైనా ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్రం మొత్తం వీధిదీపాలు, మంచినీటి సరఫరా విధులు బహిష్కరిస్తామని స్పష్టం చేశారు.

బలహీన వర్గాల మహిళలకు రక్షణ చట్టం తేవాలి

విశాలాంధ్ర - గుంటూరు సిటీ: బడుగు బలహీన వర్గాల మహిళలపై ఆధునిక యుగంలో కూడా దాడులు, హత్యలు, అత్యాచారయత్నాలు జరుగుతూనే ఉన్నాయని ఇవన్నీటిని అరికట్టాలి అంటే కచ్చితంగా బడుగు బలహీన వర్గాల మహిళలకు ప్రత్యేక రక్షణ చట్టం కావాలని జాతీయ బీసీ బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు తాటికొండ నరసింహారావు పేర్కొన్నారు. బుధవారం ఆంధ్ర ప్రదేశ్ మహిళా కమిషన్ రాష్ట్ర కార్యాలయం లో మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తాటి కొండ నరసింహారావు మాట్లాడుతూ కొంత కాలంగా గత ప్రభుత్వంలో బడుగు బలహీన వర్గాల మహిళలపై దాడులు పెరిగాయని అసమానతలు వివక్షతలు నేటికీ కొనసాగుతూనే ఉన్నాయని బడుగు వర్గాల మహిళలకు ప్రత్యేకమైన రక్షణ చట్టం తీసుకు రావాల్సిన అవసరం ఆవశ్యకత ఎంతో ఉం దని తెలిపారు. మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయ పాటి శైలజ స్పందిస్తూ బలహీనవర్గాల మహి ళలకు ప్రాతినిత్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని ప్రభుత్వా నికి సిఫార్సు చేస్తామని హామీ ఇచ్చారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో తన్నీరు సాంబయ్య, విజయలక్ష్మి ఉన్నారు.

అవగాహనతో మాతృమరణాలు నివారణ

విశాలాంధ్ర - గుంటూరు వైద్యం : గుంటూరులోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ఛాంబంలో డిఎంహెచ్ఓ డాక్టర్ కె.విజయలక్ష్మి అధ్యక్షతన సబ్ డిస్ట్రిక్ట్ లెవెల్ మాతృ మరణాల కమిటీ సమీక్షా సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశం నందు మే నెలలో గుంటూరువారితోట పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో జరిగిన మాతృ మరణానికి గల కారణాలను కమిటీ సభ్యులు సమీక్షించారు. మరణానికి గల కారణాలు కమిటీ సభ్యులు కూలంకుషంగా చర్చించిన అనంతరం ఆ మరణం నివారించలేనిదని కమిటీ సభ్యులు నిర్ధారించారని డిఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి పేర్కొన్నారు. ముందు ముందు ఇటువంటి మరణాలు సంభవించకుండా ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆరోగ్య పర్యవేక్షకులు, వైద్యాధికారులు, మాతృ మరణాలకు గల కారణములు గర్భిణీ స్త్రీలు, బాలింతలతో పాటు వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించినపుడే ఆ మరణాలను నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు డీసీహెచ్ఎస్ డాక్టర్ రంగారావు, డాక్టర్ ఝాన్సీ వాణి, డాక్టర్ బుచ్చిబాబు, డాక్టర్ ఆదిత్య ప్రదీప్ రెడ్డి, డాక్టర్ రాధికా రాయుడు, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ రోహిణి రత్నశ్రీ, డాక్టర్ ప్రియాంక, డీపీహెచ్ఎన్ఓ ఇన్‌ఛార్జ్ శ్రీధర్ రెడ్డి, హెల్త్ సూపర్ వైజర్ పాల్గొన్నారు.

ఎమర్జెన్సీ డే 50 సంవత్సరాలు

విశాలాంధ్ర - తెనాలి : 1975 సంవత్సరంలో 21 నెలల పాటు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ దేశంలో ఎమర్జెన్సీ దేను విధించి నేటికి 50 సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంగా ఎన్.ఆర్.కె., కెఆర్‌యస, గుప్తా కాలేజ్‌లో బుధవారం సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిధిగా గుంటూరు జిల్లా భారతీయ జనతాపార్టీ అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు, కార్యవర్గ సభ్యురాలు స్వరూపారాణి, అధికార ప్రతినిధి తమరిశ అనంతాచార్యులు పాల్గొని మాట్లాడుతూ నాటి ఎమర్జెన్సీ దే యొక్క పరిణామాల గురించి నేటి విద్యార్థిని విద్యార్థులు తెలుసుకోవాల్సిన విషయాల గురించి సవివరముగా తెలిపారు. తెనాలి బండ్ మీద వున్న తరిమిశ రామాచార్యులు విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పిం చారు. కార్యక్రమంలో కొల్లిపర మండల ప్రెసిడెంట్ నంద కిషోర్, తెనాలి రెండవ పట్టణ ఇన్‌ఛార్జ్ శిఖా రవీందర్, యర్రంరాజు సందీప్, సీనియర్ నాయకులు, బిట్రా కనక దుర్గ, వేణు, సంపత్ రాయుడు, సుధాకర్ పాల్గొన్నారు.

రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ

విశాలాంధ్ర - కాకుమాను : మండల పరిధిలోని వల్లూరు, చిన లింగాయపాలెం గ్రామాలలో మండల వ్యవసాయ శాఖ అధికారి వి.సుధాకర్ బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేసి, పొగాకు రైతులు రైతుసేవా కేంద్రాలనందు రిజిస్ట్రేషన్ ప్రాసెస్ త్వర గా పూర్తి చేసుకోవాలన్నారు. అర్హులైనవారికి కౌలురైతు కార్డులు అందించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమం లో వివిఎలు హేమంత్ కుమార్, అంజలి, రైతులు పాల్గొన్నారు.

గోపి కుమార్ సేవలు వెలకట్టలేనివి : డొక్కా

విశాలాంధ్ర - గుంటూరు వైద్యం : సేవా సదన్ అధ్యక్షులు, జనసేన నాయకులు మిరియాల గోపి కుమార్, మిరియాల ప్రసాద రావుల సేవలు ఆదర్శమని, కళా రంగానికి వారు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని మాజీమంత్రి, టీడీపీ నాయకులు డొక్కా మాణిక్యవర ప్రసాద్ కొనియాడారు. కళా రంగానికి వారు చేస్తున్న సేవలకు గుర్తుగా గుంటూరు నగర సంగీత కళాకారుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో అన్నదాన సమాజం ఆడిటోరియంలో పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డొక్కా మాణిక్యవర ప్రసాద్ మాట్లాడుతూ అన్నదాన సమాజం అభి వృద్ధికి ఎనలేని కృషి చేశారని పేర్కొన్నారు. అఖిల భారత పంచా యతీ పరిషత్ (ఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు, అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మ న్ డాక్టర్ జాస్తి వీరాంజనే యులు మాట్లాడుతూ మిరియాల గోపి కుమార్ చేస్తున్న సామాజిక కృషి అభినందనీ యమని కొనియాడారు. సేవా సదన్ స్థాపించిన నాటి నుంచి నేటి వరకు బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఉచిత మెడికల్ క్యాంపులు, రక్తదాన శిబిరాలు, కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. భాష్యం విద్యా సంస్థల అధినేత భాష్యం రామకృష్ణ మిరియాల గోపికుమార్‌ను ప్రత్యేకంగా పూలబొకే అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. మిరియాల గోపి కుమార్‌ను సత్కరించిన వారిలో ఉమ్మడి గుంటూరు జిల్లా జీడీసీఎంఎస్ ఛైర్మన్ వడ్రాణం హరిబాబు నాయుడు, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి(ఏపీ ఎఫ్‌డీయూసీ) ఆంధ్ర ప్రదేశ్ ఫైనాన్స్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వడ్రాణం మార్కండేయ బాబు, డాక్టర్ నిమ్మల శేషయ్య, ముత్యాల వెంకటరావు, కంబాల బాబూరావు, అబ్దుల్ ఖాదర్, దేగల వెంకటేశ్వరరావు, బిళ్ళా అశోక్, రాజశేఖర్, కళా దర్బార్ వ్యవస్థాపక అధ్యక్షులు పొత్తూరు రంగారావు, ఉప్పు వెంకట రతయ్య, మిరియాల ప్రసాదరావు, మిరియాల మురళి, ఆడపా మాణిక్యాలరావు ఉన్నారు.

కార్యకర్తల సంక్షేమమే టీడీపీ ధ్యేయం : ఎమ్మెల్యే జూలకంటి

విశాలాంధ్ర - కారంపూడి : కార్యకర్తల సంక్షేమమే ధ్యేయంగా తెలుగుదేశం పార్టీ కట్టుబడి పనిచేస్తోందని మాచర్ల శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి బుధవారం అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో కారంపూడి మండలం, ఒప్పిచర్లకు చెందిన టీడీపీ కార్యకర్త కోటయ్య మృతి చెందాడు. ఈ సందర్భంగా పార్టీ సభ్యత్వం తీసుకున్న కోటయ్య కుటుంబ సభ్యులకు బుధవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మె ల్యే జూలకంటి మృతుడి కుటుంబ సభ్యులకు ప్రమాద భీమా రూ.5 లక్షల నగదు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యకర్తల కష్టాలను ఎరిగి, నిత్యం వారి అభ్య న్నతి కోసం పార్టీ అధినేత చంద్రబాబు పరితపిస్తూ ఉంటారని పేర్కొన్నారు. పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తను ఆపత్కాలంలో భీమా ద్వారా ఆదుకోవడం గొప్ప విషయమ న్నారు. ప్రమా దాల్లో కుటుంబ సభ్యులను కొల్పొయిన కుటుంబాలకు పార్టీ ప్రమాద భీమా కొంతమేరకు అండగా నిలుస్తోందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి పంగులూరి పుల్ల య్య, కారంపూడి మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మర్రెడ్డి మృతి బాధాకరం

విశాలాంధ్ర - రెంటచింతల : రెంట చింతల మాజీ సర్పంచి అల్లం మర్రెడ్డి(79) మృ తి బాధాకరమని మా చర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. బుధవారం మర్రెడ్డి మృతదేహానికి పూలదండవేసి నివాళి అర్పించారు. 18 ఏళ్లపాటు రెంటచింతల సర్పంచ్‌గా పిడుగు రాళ్ల మార్కెట్ యార్డు డైరక్టరు, రెంటచింతల మేజరు సాగు నీటి సంఘం అధ్యక్షుడిగా మచ్చలేని నాయకుడిగా పనిచేశార న్నారు. వీరి వెంట అల్లం ప్రతాపరెడ్డి, ఆదూరి ఇన్నారెడ్డి,అల్లం జోసెఫ్ రెడ్డి,టీడీపీ మాజీ వైస్ ఎంపీపీ గొంటు సుమంత్ రెడ్డి,టౌన్ అద్యక్షుడు మూలి రాజారెడ్డి, పీహెచ్సీ మాజీ చైర్మన్ బోడపాటి రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

అద్దె బకాయిలు చెల్లించలేదని షాపింగ్ కాంపెక్స్ సీజ్

విశాలాంధ్ర - పొన్నూరు : పొన్నూరు పురపాలక సంఘం అనురాధ కాంప్లెక్స్‌లోని షాపులను బుధవారం మున్సిపల్ అధికారులు సీజ్ చేశారు. గుత్తేదారుడు ఒక ఏడాది నుంచి సుమారు రూ.15 లక్షలు అద్దె బకాయిలు ఉన్నట్లు గడువు ఇచ్చిన బకాయిలు చెల్లించని నేపథ్యంలో సీజ్ చేసినట్లు మున్సిపల్ రెవెన్యూ అధికారులు తెలిపారు. మున్సిపల్ ఇందిరాగాంధీ కాంప్లెక్స్‌లో అద్దె బకాయిలు చెల్లించని 4 షాపులను కూడా సీజ్ చేసినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

విశాలాంధ్ర - పెదనందిపాడు : విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగాఉండాలని ప్రిన్సిపాల్ డాక్టర్ గుర్రం వీర రాఘవయ్య అన్నారు.స్థానిక పి.ఎ.ఎస్ కళాశాల నందు బుధవారం డ్రగ్స్, పొగాకు ఉత్పత్తులపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి, వాటివల్ల జరిగే అనర్థాలను వివరించి, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో హెచ్. ఓ.డిలు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులందరికీ కౌలు రైతు కార్డు

విశాలాంధ్ర - పొన్నూరు : పొన్నూరు తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం రెవెన్యూ వ్యవసాయ శాఖ సిబ్బందికి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పొన్నూరు తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ మాట్లాడుతూ అర్హులందరికీ కౌలు రైతు కార్డులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. వీఆర్వోలు, గ్రామ వ్యవసాయ సహాయకులు సమన్వయంతో పనిచేసి ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. అర్హులైన ప్రతి రైతు వద్ద నుంచి రైతు పాస్ పుస్తకము, ఫోన్ నెంబరు, కౌలు రైతు ఆధార్ కార్డు, ఫొటో, ఫోన్ నెంబరు సేకరించి కార్డు ఇచ్చే విధంగా పనిచేయాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లక్ష్యాలను చేరుకోని వీఆర్వోలు, గ్రామ వ్యవసాయ సహాయకులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోంటామని హెచ్చరించారు. సమావేశంలో కార్యాలయ సూపరింటెండెంట్ ఆలేటి మాధవి, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మగతాటి శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి ఆరు వెంకటేశ్వరరావు, వ్యవసాయ విస్తరణ అధికారి ఐ.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రెండు కళ్లుగా... అభివృద్ధి, సంక్షేమం

విశాలాంధ్ర - నూజెండ్ల : నూజెండ్ల మండల చింతలచెరువు గ్రామ పంచా యతీ సం స్థాగత ఎన్నికల కార్యక్రమంలో వినుకొండ మార్కెట్ యార్డ్ చైర్మన్ మీసాల మురళి యాదవ్, జడ్పీటీసీ సుబ్బులు రామయ్య, రాష్ట్ర రైతు విభాగం కార్య దర్శి వంకాయలపాటి పేరయ్య మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభివృద్ధిలో భాగంగా విశాఖ రైల్వే జోన్, అమరావతి, పోలవరం నిర్మాణం, కడప స్టీల్ ప్లాంట్, నూతన పరిశ్రమల కోసం ప్రోత్సాహం పలు అభివృద్ధి కార్యక్రమాలు, గ్రామాల అభివృద్ధి కోసం రాష్ట్రంలో ప్రతి గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమంతో సీసీ రోడ్డు డ్రైనేజ్ పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. చింతల చెరువు సంస్థాగత గ్రామ పార్టీ అధ్యక్షులుగా గుమ్మ వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా మల్లెల చిన్న వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి చింతలచెరువు సుభాని, కార్యదర్శిగా జి.ఎర్ర కోటయ్య, బూత్ కన్వీనర్‌గా రామయ్య, కోకన్వీనర్‌గా సైదులు ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జ్ బాబురావు, సాగు నీటి సంఘం అధ్యక్షులు లేళ్ల శేషయ్య, సర్పంచ్ కొండలు, సేగు అప్పారావు, మాజీ సర్పంచ్ వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ సుబ్బయ్య, చాపలమడుగు మస్తాన్, సుభాని, లేళ్ల రామయ్య పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

విశాలాంధ్ర - యడ్లపాడు : మండల కేంద్రమైన యడ్లపాడు తిమ్మాపురం గ్రామాల మధ్య 16వ నెంబర్ జాతీయ రహదారి కి చెందిన డ్రెనేజి కాలువలో నక్కవాగు సమీపంలో బుధవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనది. యడ్లపాడు ఎస్ఐ శివరామకృష్ణ తెలిపిన వివరాల మేరకు ఉదయం 9,10 గంటల సమయంలో ఫ్లెక్సీ (బ్యానర్) లో చుట్టబడి దగ్ధమౌతున్న శవాన్ని హై వే సిబ్బంది చూసి పోలీసులకు సమాచార మిచ్చారు. అప్పటికే తల తప్ప మిగిలిన శరీరం దగ్ధమైనస్తిలో ఉంది. వివరాల కొరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు, చిలకలూరిపేట రూరల్ సిఐ సుబ్బానాయడు, తదితరులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

అన్నదాన కార్యక్రమం

విశాలాంధ్ర - మంగళగిరి : శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్మన్ పందేటి సాంబశివరావు ఆధ్వర్యంలో బుధవారం మంగళగిరి శ్రీ పానకాలలక్ష్మీ నరసింహ స్వామివారి దేవ స్థానం మెట్ల మార్గంలో భారీ అన్నదాన జరిగింది. ఈ సందర్భంగా శ్రీ కాశీ అన్న పూర్ణేశ్వరి సేవా ట్రస్ట్ చైర్మన్ పందేటి సాం బశివరావు మాట్లాడుతూ తమ ట్రస్ట్ ద్వారా 40 మంది దాతల సహకారంతో భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ కాశీ అన్న పూర్ణేశ్వరి సేవా ట్రస్ట్ సభ్యులు నంగళం ప్రసాద్, కర్నాటి శివ సత్యనారాయణ, ఖగ్గా శ్రీనివాసరావు, పెరుమాళ్ళ సుబ్రహ్మణ్యం, పంచల శివన్నారాయణ, మారం మల్లికార్జునరావు, కోరాడ శ్రీనివాసరావు, ఉద్దంటి మురహరిరావు, డోగిపర్తి శ్రీహరిరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగించుకోండి

- నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర

విశాలాంధ్ర - గుంటూరు కలెక్టరేట్ : విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని, విద్యా శాఖలో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. స్థానిక పట్టాభిపురం మునిసిపల్ కార్పొరేషన్ పాఠశాలలో 2024-25 విద్యాసంవత్సరంలో 10వ తరగతి లో 500లకు పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు పాఠశాల పూర్వ విద్యార్థుల ఆధ్వర్యం లో బుధవారం ప్రోత్సహకాలు, ప్రభుత్వం అందిస్తున్న బుక్స్, యూనిఫాం, పాఠ్యపుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యాభివృద్ధికి విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. ప్రభుతం అందిస్తున్న ఈ సంక్షేమ పథకాలను విద్యార్థులు ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకుని ఉన్నత శికరాలు అధిరోహిం చాలన్నారు. పాఠశాలలో 10వ తరగతి పూర్తి చేసి ఐఐటీలో సీటు సాధించిన హాసినిని మేయర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్, పూర్వ విద్యార్థులు చావాలి గణపతి, కామేశ్వరరావు, రఘుకుమార్, పతంజలి, కృష్ణ శాస్త్రి, నరహరి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన ముగిసే వరకు అప్రమత్తంగా ఉండండి: నగర కమిషనర్

విశాలాంధ్ర - గుంటూరు కలెక్టరేట్ : అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఈ నెల 26న గుంటూరు నగరంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన ముగిసే వరకు జీఎంసీ అధి కారులు అప్రమత్తంగా ఉండాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాల్లో జీఎంసీ అధికారులతో కలిసి కమిషనర్ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వి నియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గుంటూరు నగరంలోని శ్రీ కన్వెన్షన్ నుంచి ఐడీ హాస్పిటల్ వరకు చేపట్టే ర్యాలీ, సభా కార్యక్రమాల్లో, శుక్రవారం ఆర్వీఆర్ జేసీ కాలేజిలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొనే నేపథ్యంలో సభ జరిగే ప్రాంతాలు, ముఖ్య మంత్రి వచ్చే మార్గాల్లో జీఎంసీ తీసుకోవాల్సిన చర్యల కోసం అధికారులకు విధులు కేటాయించామని తెలిపారు. ఇంజి నీరింగ్ అదికారులను, పిన్ పాయింట్‌గా పారిశుధ్య పనులు చేపట్టాలని సీఎంఓహెచ్‌ని, రోడ్ల వెంబడి బ్యానర్లు, హోర్డింగ్స్‌ని తొలగించాలని సిటి ప్లానర్‌ను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం కోసం డిప్యూటీ కమిషనర్లు, విభాగాధిపతులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేయాలని, కేటాయించిన విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దస్తావేజు పోయినది

నా క్లయింటు గుంటూరు జిల్లా పెదకాకాని మండలం, వెనిగండ్ల గ్రామము కాపురస్తులు **మాకిరెడ్డి రాఘవమ్మ, భర్త శ్రీనివాస రెడ్డి గారికి** చెందిన దస్తావేజు నెం. **2144/1983**గా పెదకాకాని యస్.ఆర్.ఓ.లో రిజిష్టరు కాబడిన వెనిగండ్ల గ్రామములోని సొంత ఇంటి తాలూకు దస్తావేజు పెదకాకానిలో జిరాక్స్ తీయించుకొని ది. **10-06-2025**న ఆటోలో ఇంటికి వస్తుంటే పోయినది. కావున సదరు ఒరిజినల్ దస్తావేజు ఎవరికైనా దొరికిన యెడల పై అడ్రసులోని నా క్లయింటుకు అందజేయవలసిందిగా మనవి.

కె.రామకృష్ణారెడ్డి, అడ్వకేట్,
గుంటూరు. సెల్ : **9492708564**

సాధారణ నోటీసు

పల్నాడు జిల్లా, మాచర్ల మండలం, తాళ్లపల్లి గ్రామస్తుడు **బిట్టు లింగయ్య, తండ్రి వెంకటేశ్వర్లు** అనువారు శ్రీ గురజాల సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కోర్టునందు ఐ.పి.నెం: **14/2025**ను దాఖలు చేసి తనను ఇన్‌సాల్వెంట్‌గా ప్రకటించమని కోరియున్నారు.
వాయిదా **ది.26-6-2025.**
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

షేక్ గాలిం సాహెబ్
పిటీషనర్ తరపు న్యాయవాది
మాచర్ల-522426.
సెల్ నెం : **9989125087**

బహిరంగ ప్రకటన

నా క్లయింటు గుంటూరు సిటి, కొరిటెపాడు, చైతన్యపురి జీరో లైను, డోరు నెం.4-22-3-4రు కాపురస్తులు లేటు కలవకూరి వెంకటేశ్వరరావు గారి కుమారుడు **కలవకూరి శ్రీనివాస్** (సెల్: 99123 54888) గారి సంజాయిషీ పొంది యావన్మందికీ తెలియజేయునది–
నా క్లయింటునకు తండ్రి కలవకూరి వెంకటేశ్వరరావు గారి పేరిట గుంటూరు జిల్లా, తాడికొండ మండలం, పాములపాడు గ్రామ డి.నెం.382, డి.నెం.383-సి నందు య.1-00 శెంట్లు భూమి కలదు. సదరు భూమి వారి పేరిటకు ది.19-02-2020న దఖలు దస్తావేజు నెం.521/2020రుగా తాడికొండ సబ్ రిజిస్ట్రారు వారి కార్యాలయంలో రిజిష్టరు కాబడినది. అనంతరం సదరాస్తిని గురించి కలవకూరి వెంకటేశ్వరరావు గారు ఎటువంటి లిఖితపూర్వక ఏర్పాట్లు చేయకుండగనే ది.02-07-2021న మరణించినారు. వారి భార్య కలవకూరి సీతారావమ్మ గారు కూడా ది.08-12-2018న మరణించినారు. నా క్లయింటు యొక్క తల్లిదండ్రులు మరణించిన అనంతరం పైన పేర్కొన్న దస్తావేజు ఒరిజినల్ నా క్లయింటు వద్దనే భద్రపర్చియున్నది.
కాగా, పైన పేర్కొన్న ఒరిజినల్ దఖలు దస్తావేజు నెం.521/2020ను ది.17-06-2025న నా క్లయింటు ఒక కవరులో పెట్టుకుని లాడ్జిసెంటర్ ఏరియా నుండి అరండల్‌పేట 9వ లైనుకు జిరాక్సు నిమిత్తం టూవీలర్‌పై వెళ్లుచుండగా మార్గమధ్యలో ఎక్కడో జారిపడిపోయినది.
సదరు దస్తావేజు ఎవరికైనా దొరికిన యెడల నా క్లయింటుకు అందజేసి తగిన పారితోషికము పొందగలరు. అలాగే సదరాస్తి విషయమై ఎవరికైనా అభ్యంతరములు, ఆక్షేపణలు ఉన్న యెడల నాకు గానీ, నా క్లయింటుకు గానీ తెలియజేయగలరు. అట్లుకాక సదరు దస్తావేజును దుర్వినియోగపరిచిన యెడల నా క్లయింటు తీసుకొను చట్టపరమైన చర్యలకు బాధ్యులగుదురు.

ఇట్లు:
పులిపర్తి శ్రీనివాస్, ఎం.ఎ., ఎం.ఎల్., ఎం.ఎల్.ఎం. అడ్వకేట్, చిరునామా: అరండల్‌పేట 6/4వ లైను, గుంటూరు, సెల్: 9885652296.

మోసపు హామీలతో ప్రజలను వంచిస్తున్న మోదీ

విశాలాంధ్ర - మంగళగిరి : కేంద్రంలోని నరేంద్ర మోదీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలు అనేక ఇబ్బందులుపడుతున్నారని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య అన్నారు. బుధవారం మంగళగిరి పట్టణం ఇందిరా నగర్‌లో గల సీపీఐ కార్యాలయంలో శాఖా మహాసభ జరిగింది. ఈ సభకు సీపీఐ సీనియర్ నాయకులు గోలి వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన చిన్ని తిరుపతయ్య తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ కేంద్రంలో నరేంద్ర మోదీ మూడోసారి అధికారం చేపట్టిన తర్వాత పేద, బడుగు, బలహీన వర్గాలు, సామాన్య ప్రజల బతుకులు భారమయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆస్తులను తన మిత్రులైన అదానీ, అంబానీలకు దోచిపెడుతున్నారని మండిపడ్డారు. కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నారని, ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ పరం చేస్తున్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలపై ఎప్పటికప్పుడు పోరాటాలు చేస్తూ పేద, బడుగు, బలహీన వర్గాల, సామాన్య ప్రజల పక్షాన నిలబడుతూ వారి సమస్యలు పరిష్కరించడంలో సీపీఐ ఎప్పుడు ముం దుంటుందని అన్నారు. ప్రజల పక్షాన నిరంతర పోరాటంలో ఎర్ర జెండా ముం దుంటుందని ఆయన అన్నారు. ఇందిరా నగర్‌లో ఇళ్ల స్థలాలు ఇప్పించిన ఘనత సీపీఐకే దక్కుతుందన్నారు. మంగళగిరి నియోజకవర్గ పరిధిలో సీపీఐ అనేక భూ పోరాటాలు చేసి పేద ప్రజలకు ఇల్లు ఇప్పించిందని గుర్తుచేశారు. సీపీఐ పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్ మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ కార్మికుల సమస్యలు పరిష్క రించడంలో విఫలమైందని విమర్శించారు. మోదీ పెట్టుబడిదారులకు దాసోహం అనేలా కార్మిక చట్టా లను మారుస్తూ కార్మికులను వారికి బానిసలుగా చేసేందుకు కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను ఆయన మారుస్తున్నారని ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముందుగా మృతవీరులకు సంతాపాన్ని తెలియజేశారు. ఈ మహాసభలో సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య, పట్టణ సహాయ కార్యదర్శి నందం బ్రహ్మేశ్వరరావు, 4వ వార్డు శాఖ కార్యదర్శి చిన్ని సత్యనారాయణ, జొన్నాదుల భారతి, దామర్ల పద్మ, ఉడత శ్రీనివాసరావు, కోలా వీరాంజనేయులు, బాణాల సూరిబాబు, సాంబయ్య, గద్దం ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

నేడు సీపీఐ మండల మహాసభ

విశాలాంధ్ర - ఈపూరు : సీపీఐ మండల మహాసభ ఈ నెల 26వ తేదీన మండల కేంద్రమైన ఈపూరులో నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కార్యదర్శి ఊట్ల రామారావు బుధవారం తెలిపారు. ఈపూరు గ్రామంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న శ్రీనివాస కల్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి ఏ.మారుతి వరప్రసాద్, వినుకొండ నియోజకవర్గ సమితి కార్యదర్శి బూదాల శ్రీనివాసరావుతో పాటు పలువురు నాయకులు పాల్గొననున్నారని ఊట్ల రామారావు తెలిపారు. ఈ మహాసభలకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి పార్టీ సభ్యులు, సానుభూతిపరులు, యువకులు, విద్యార్థులు రైతులు, ప్రజలు, కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

తోట వెంకటరామయ్యకు సీపీఐ నాయకుల నివాళులు

విశాలాంధ్ర - మంగళగిరి : మండలంలోని కురగల్లు గ్రామంలోని సీపీఐ సీనియర్ నాయకులు తోట వెంకటరామయ్య దశదినకర్మ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, నియోజకవర్గ సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య, మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు, సీపీఐ 4వ వార్డు శాఖ కార్యదర్శి చిన్ని సత్యనారాయణ, పంతగాని మరియదాసులు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సార్వత్రిక సమ్మె నోటీసులు అందజేత

విశాలాంధ్ర - మంగళగిరి : కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా జూలై 9వ తేదీన జరిగే సార్వత్రిక సమ్మె నోటీసులను బుధవారం ఏఐటీయూసీ, సీఐటీయూ, వైఎస్సార్‌టీయూసీ నాయకులు మంగళగిరిలోని పట్టణంలోని ఆటోనగర్‌లోని కార్మిక వాడలో నోటీసులు అందజేశారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని వారు తెలిపారు. జూలై 9వ తేదీన జరిగే సమ్మెలో ఆటో రంగంలో పనిచేసే కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని సత్యనారాయణ, సీఐటీయూ జిల్లా నాయకులు ఎస్ఎస్ చెంగయ్య, సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎం. బాలాజీ, వైఎస్సార్‌టీయూసీ నాయకులు ఆర్.శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

సీపీఐ ములుకుదురు గ్రామ మహాసభ

విశాలాంధ్ర - పొన్నూరు : సీపీఐ ములుకుదురు గ్రామ మహాసభ జరిగినది. ఈ కార్యక్రమమునకు మల్లవరపు రమణ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా పొన్నూరు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ మాట్లాడుతూ ములుకుదురు గ్రామములో నివాసముంటున్న అర్హులైన నిరుపేదలకు మూడు సెంట్లు స్థలాలు సాధించేందుకు పోరాటం చేయడంతో పాటు కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ వాగ్దానాలను నెరవేర్చే వరకు నిరంతర పోరాటం కొనసాగించాలని గ్రామంలో తాగు నీరు లభ్యత గురించి అలాగే డ్రైనేజీ మురుగునీరు పారుదల, వర్షాకాలం ప్రారంభమైనందున రైతు విత్తనం నాటే సమయం వచ్చింది కాబట్టి నకిలీ విత్తన కంపెనీల ఆగడాలను అరికడుతూ వారి నుంచి రైతు నష్టపోకుండా ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకురావడంతో పాటు తక్షణ చర్యలు చేపట్టే విధంగా గ్రామ కమిటీ చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం మహాసభలో ఏకగ్రీవంగా షేక్ గౌస్‌ను గ్రామ కార్యదర్శిగా ఎన్నుకొన్నారు. ఈ కార్యక్రమంలో తాడిశెట్టి శ్రీనివాసరావు, షేక్ రఫీ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి అమ్మితే కఠిన చర్యలు : ఎస్పీ

విశాలాంధ్ర - నరసరావుపేట : పల్నాడు జిల్లా వ్యాప్తంగా గంజాయి హాట్‌స్పాట్‌లను గుర్తించి పూర్తిగా తనిఖీ చేసి గంజాయి అమ్మే వారిపై కఠిన చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులను జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు ఆదేశించారు. మాదకద్రవ్యాల నివారణపై బుధ వారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా ఎస్పీ పాల్గొని అధికారులకు పలు సూచనలు చేశారు. మాదక ద్రవ్యాల సంబంధిత కార్యకలాపాల్లో ఉన్న అనుమానిత వ్యక్తులపై నిఘా ఉంచాలన్నారు. డ్రగ్ అబ్యూజ్ అవగాహన, నివారణను ప్రోత్సహించడానికి పాఠశాలల నుండి విశ్వ విద్యాలయాల వరకు అన్ని విద్యా సంస్థలలో ఈగిల్ క్లబ్‌లను తప్పనిసరిగా ఏర్పాటు చేసి, క్లబ్ ల సభ్యుల వివరాలతో డేటాబేస్ నిర్వహించాలని డీఈవోను ఆదేశించారు. ఎన్.డీ.పీ.ఎస్ కేసులు, ఎన్‌డీపీఎస్ చట్టం కింద గతంలో నమోదైన కేసులు మరియు కొత్త కేసులపై సమీక్ష నిర్వహించారు. మాదక ద్రవ్యాల వినియోగదారుల గుర్తింపు, గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలను వినియోగించే వ్యక్తులను గుర్తించి, ట్రాక్ చేయడానికి వ్యూహాలు అమలు చేయాలని సూచించారు. డీ-అడిక్షన్ సెంటర్లలో మాదక ద్రవ్య వినియోగ దారుల పునరావాసం, సహాయం కోసం డీ-అడిక్షన్ సెంటర్ల యొక్క ప్రాముఖ్యతను ప్రత్యేకంగా చెప్పారు. ఇంటర్-డిపార్ట్‌మెంటల్ సహకారం, మాదక ద్రవ్య దుర్వినియోగ నిర్మూలన లో బాధ్యతాయుతమైన అన్ని శాఖలు మరియు స్టేక్‌హోల్డర్లు సమన్వయంతో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. జూన్ 26, 2025న అంతర్జాతీయ మాదక ద్రవ్య దుర్వినియోగం మరియు అక్రమ రవాణా నిరోధక దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా వాకథాన్ నిర్వహణకు సూచనలు జారీ చేశారు. వాకథాన్ విజయవంతంగా నిర్వహించడానికి అన్ని శాఖలు సమన్వయం చేయాలన్నారు. డీ-అడిక్షన్ సెంటర్లు పునరావాస సహాయం కోసం అవుట్‌రీచ్ ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు.అదనపు ఎస్పీ, ఎక్సైజ్ సూపరింటెండెంట్, జిల్లా విద్యాశాఖ అధికారి చంద్రకళ, ఈగిల్ అధికారి సామాజిక సంక్షేమ అధికారి శామ్యూల్ రాజీవ్, జిల్లా రెవెన్యూ అధికారి డీఆర్వో ఈ. మురళి, మాతా జ్ఞానమ్మ డీ-అడిక్షన్ సెంటర్ (ఎన్జీవో) ప్రతినిధులు, జిల్లా వైద్య అండ్ ఆరోగ్య అధికారి రవి, స్పెషల్ బ్రాంచ్ అదనపు ఎస్పీ తదితరులు పాల్గొన్నారు.

పేర్ని నాని వ్యాఖ్యలకు ఎమ్మెల్యే పంతం ఖండన

విశాలాంధ్ర - మంగళగిరి : డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై వైసీపీ నేత పేర్ని నాని చేసిన వ్యాఖ్యలను కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ తీవ్రంగా ఖండించారు. బుధవారం మంగళగిరి పట్టణంలోని జనసేన పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ మాట్లా డుతూ పంచాయతీ రాజ్ శాఖలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఏడాది పాలనలో ఎలాంటి అభివృద్ధి చేయలేదని విమర్శిస్తున్న పేర్ని నాని చీకటి పడగానే అమూల్ బేబీల ఐస్ క్రీమ్ తినటమే పనిగా పెట్టుకుంటారని ఆయన ఆరోపించారు. జగన్ పాలనలో పంచాయతీరాజ్ శాఖలో మీరు చేసిన అభివృద్ధి చూపాలని పేర్ని నానికి సవాల్ విసిరిన పంతం నానాజీ గ్రామాలలో మీరు చేసిన సర్వే సరైనది కాదని దమ్ముంటే గ్రామాలలో నిర్వహించే గ్రామ సభలలో చర్చించాలని ఆయన అన్నారు. జనసేన పార్టీ నాయకులు ఎమ్మెల్యేలు అవినీతిలో కూరుకుపోయారని అంటున్న నాని కొల్లేరులో 600 ఎకరాలు కబ్జా చేసి కలెక్టర్‌ను మార్చాలంటూ ఒత్తిడి చేసింది నీవు కాదా అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్ కళ్యాణ్‌ని విమర్శిస్తే సహించేది లేదని హెచ్చరించారు. వైసీపీ నేతలు మాట్లాడే తీరు మార్చుకోవాలని లేదంటే తీవ్ర పరిణామాలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏపీ మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, జనసేన పార్టీ ప్రకాశం జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

రోబొటిక్ సర్జరీలలో భారత్ పురోభివృద్ధి

- రష్యన్లలో పెరుగుతున్న ఆసక్తి -డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి

విశాలాంధ్ర - గుంటూరు వైద్యం : మోకీలు, తుంటి మార్పిడి శస్త్ర చికిత్సలలో రోబొటిక్, కృత్రిమ మేధస్సు పురోగతిని రష్యన్లకు పరిచయం చేయడం చాలా సంతోషంగా ఉందని సీనియర్ జాయింట్ రీ-ప్లేస్‌మెంట్ సర్జన్, సాయి భాస్కర్ మల్టి స్పెషాలిటీ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి అన్నారు. రష్యా రాజధాని మాస్కోలో నాలుగు రోజులు పాటు జరిగిన యూరో ఆసియన్ ఆర్థోపెడిక్ ఫోరం ప్రదర్శనలో పాల్గొని వచ్చిన డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి అక్కడి అనుభవాలను బుధవారం సాయి భాస్కర్ హాస్పిటల్స్ సిబ్బందితో పంచుకున్నారు. ఈ ఏడాది జనవరిలో ప్రధాని నరేంద్రమోదీ ఆర్థోపెడిక్ విభాగంలో రోబొటిక్‌ల వినియోగం పెంచాలని సూచిస్తూ పలు రోబొటిక్‌లను ప్రారంభించమని తెలిపారు. దానికి అనుగుణంగానే రష్యాలో జరిగిన ఈ ప్రదర్శనలో భారత్‌లో ఆర్థోపెడిక్ రంగంలో రోబొటిక్, ఆర్టిఫిషియల్ ఇంటలి జెన్స్ వినియోగాన్ని అనుసరిస్తున్న ఆధునిక సాంకేతిక పద్ధతులను రష్యన్ సర్జన్లకు వివరించడం కొత్త అనుభూతి మిగిల్చిందని చెప్పారు. జాయింట్ రీప్లేస్‌మెంట్‌లో రోబొటిక్ వాడకంపై రష్యన్ సర్జన్లు ప్రత్యేక ఆసక్తిని కనబరిచారని, రష్యాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్నప్పటికీ సమావేశాలకు దాదాపు 500 మందికి పైగా ఎముకలు, కీళ్ల వైద్య నిపుణులు హాజరైనట్లు పేర్కొన్నారు. భారత్‌లో జరుగుతున్న మోకీలు, తుంటి మార్పిడి శస్త్ర చికిత్సలలో రోబొటిక్ పాత్ర, అనుభవాలను అక్కడి వారికి వివరించినట్లు డాక్టర్ నరేంద్రరెడ్డి తెలిపారు.

సినీ హీరోయిన్ అనన్య సదండి

విశాలాంధ్ర - గుడివాడ : ఏషియన్ పెయింట్స్ ప్రమోషన్‌లో భాగంగా బుధవారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియం కాంప్లెక్స్‌లోని రవి పెయింట్స్‌ను ప్రముఖ సినీ హీరోయిన్ అనన్య సందర్శించారు. ఈ సందర్భంగా హీరోయిన్ అనన్యకు రవి పెయింట్స్ ప్రొప్రైటర్స్ కొల్లిపర సందీప్, మణిదీప్‌లు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హీరోయిన్ అనన్య మాట్లాడుతూ కృష్ణా జిల్లా వ్యాప్తంగా ఏషియన్ పెయింట్స్ ఉత్పత్తులను ప్రజలకు చేరువ చేయడంలో రవి పెయింట్స్ యాజమాన్యం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. జిల్లా వ్యాప్తంగా రెండవ స్థానంలో నిలిచిన రవి పెయింట్స్ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ స్టేడియం సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్, వైశ్య ప్రముఖులు కొల్లిపర సాయి, జవ్వాజి గంగరాజు పాల్గొన్నారు.

నేడు ఉమ్మడి కృష్ణాజిల్లా ఫెన్సింగ్ జట్ల ఎంపిక

విశాలాంధ్ర- నందగామ/వీరులపాడు : ఉమ్మడి కృష్ణాజిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూన్ 26వ తేదీన వీరులపాడు మండలం పొన్నవరం లోని ఏకత్వ పబ్లిక్ స్కూల్ లోని ఇండోర్ హాల్ నందు చైల్డ్ (అండర్ 10), మినీ (అండర్ 12) బాల బాలికల జిల్లా జట్ల ఎంపికలను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఫెన్సింగ్ సంఘ కార్యదర్శి నాగం సతీష్ బాబు తెలిపారు. చైల్డ్ (అండర్ 10)కేటగిరీకి చెందిన బాల బాలికలు జనవరి 01వ తేదీ 2016 గాని తరువాత జన్మించిన వారు అర్హులని అన్నారు. మినీ (అండర్ 12) కేటగిరీకి చెందిన బాల బాలికలు జనవరి 1వ తేది 2014 గాని తరువాత జన్మించిన వారు అర్హులని అన్నారు. ఈ ఎంపికలకు ఉమ్మడి కృష్ణా జిల్లాలోని ఆసక్తిగల బాలబాలికలు ఫెన్సింగ్ అసోసియేషన్ వారి గుర్తింపు కార్డు, ఆధార్ జిరాక్స్, జననం ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని కోరారు. ఎంపికైన క్రీడాకారులు జూన్ 29వ తేదీన ఉదయం నుండి విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో గల డిఎస్ఏ ఇండోర్ హాల్ నందు జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. పూర్తి వివరాలకు ఉమ్మడి కృష్ణాజిల్లా ఫెన్సింగ్ సంఘం ప్రధాన కార్యదర్శి నాగం సతీష్ బాబుని ఈ నెంబర్ 95535 28888 ని సంప్రదించాలని కోరారు.

29న అమ్మవారికి ఆషాడ మాస సారె

విశాలాంధ్ర-వీరులపాడు : మండలంలోని నరసింహారావు పాలెంలో ఉన్నటువంటి శ్రీ అగస్త్య పీఠం నందు ఈనెల 29వ తేదీ ఆదివారం ఆషాడ మాస సందర్భంగా అమ్మవారి కి పసుపు, కుంకుమ ఆషాడ మాస సారె సమర్పించడం జరుగుతుందని నిర్వాహకులు శ్రీ సుగుణానంద సరస్వతి స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా కుంకుమార్చనలు, వ్రతాలు నిర్వహించడం జరుగుతుందన్నారు .ఈ కార్యక్రమాలలో పాల్గొనేటువంటి భక్తులు ముందుగా తమ పేర్లు నమోదు చేయించుకోవాలని తెలిపారు. దీనికిగాను ఎటువంటి రుసుములు వసూలు చేయబడవని ఉచితంగానే నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు .కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయవలెనని ఆయన కోరారు.

రాజకీయాల్లో ఉన్మాదమే జగన్ నైజం : పవన్

విశాలాంధ్ర-గుడివాడ : మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ది అంతా ఉన్మాద రాజకీయమే అయన నాయకులు, కార్యకర్తలు కూడా దాన్ని అనుసరిస్తున్నారు. ఐదు సంవత్సరాల పాలించిన జగన్ దారుణంగా ఓడిపోయినా ఇంకా పశ్చాత్తాపం లేకుండా అదే ఉన్మాదాన్ని ప్రదర్శిస్తూ జనాలను ఇబ్బంది పెడుతున్నారు అంటూ జనసేన నాయకులు సందు పవన్ అన్నారు. బుధవారం స్థానిక బొగ్గు బజార్‌లోని జనసేన నాయకులు సందు పవన్ కార్యాలయంలో విలేకర్లు సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దురదృష్టం ఏంటంటే ఒక ముఖ్యమంత్రిగా పని చేసిన వ్యక్తి ఒక పార్టీని నడుపుతున్న అధ్యక్షుడు మానవత్వం లేకుండా ప్రజల ప్రాణాల కంటే రాజకీయాలకు ప్రధాన్యత ఇస్తు, హింసను ప్రోత్సహించడం దాస్టికమన్నారు. జగన్ పర్యటన కోసం బల ప్రదర్శనకు సామాన్యులు, అమాయకుల ప్రాణాల బలి కొలపడం మరింత దారుణమైన విషయమన్నారు. తన కారు కింద పడి చనిపోయిన సింగయ్యపై జగన్మోహన్‌రెడ్డి కనికరం లేకపోగా శవ రాజకీయాలు చేస్తూ మనుషుల ప్రాణాలతో చెలగాటమాడుతురన్నారు. గడిచిన సంవత్సర కాలంలో శవ రాజకీయాల కోసం తప్పితే బెంగళూరు ప్యాలెస్ వదిలి జగన్ ఏనాడు ప్రజల బాగోగులు కోసం రాష్ట్రానికి రాలేదని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో నాయకులు సయ్యద్ నజీర్, వంగలపూడి రాము, లోయ ప్రసాద్, కందికొండ దుర్గ, బురిడీ శాంతినాయుడు, గుళ్లపల్లి నాగబాబు, బందారు నోబుల్, సీతాల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

జక్కంపూడి కాలనిలో పేరెంట్స్ అవగాహన

విశాలాంధ్ర విజయవాడ లబ్బీపేట : జక్కంపూడి కాలనీలో నవజీవన్ బాలభవన్ అధ్వర్యంలో పేరెంట్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జక్కంపూడి ఎలిమెంటరీ హెడ్ మాస్టర్ యూసఫ్ మాట్లాడుతూ ఈ రోజుల్లో పిల్లలపై పేరెంట్స్ ప్రత్యేక శ్రద్ధ చూపించాల్సిన అవసరం ఉందని తెలిపారు. పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి చూపించాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి పి. హెచ్ .సి.డాక్టర్ షకీలా, సచివాలయం సెక్రటరీ ఉష, అంగన్వాడి టీచర్ పద్మ, స్కూల్ టీచర్ జానకి, స్కూల్ టీచర్ స్వప్న, నవజీవన్ బాలభావం నుండి టీచర్లు మేరీ రత్నం, పద్మ తులసి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమం ద్వారా తమ పిల్లల భవిష్యత్తు పట్ల అవగాహన పెరగాల పెరిగేలా చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలియజేశారు.

సిఆర్ఐ సోలార్ కు రూ. 210 కోట్ల విలువైన బహుళ రాష్ట్రాల ఆర్డర్లు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): సిఆర్ఐ పంప్స్ యొక్క ఒక విభాగం, పునరుత్పాదక ఇంధన ఆధారిత నీటి పరిష్కారాలలో అగ్రగామిగా ఉన్న సిఆర్ఐ సోలార్, 6,894 సౌర పంపింగ్ సిస్టమ్ సరఫరా, వ్యవస్థాపన, నెలకొల్పడం కోసం మహారాష్ట్ర ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ, హర్యానా రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ, పంజాబ్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ నుండి రూ. 210 కోట్ల విలువైన గణనీయమైన ఆర్డర్లను సంపాదించింది. ప్రతిష్టాత్మకమైన ఈ ఆర్డర్లు భారతదేశ వ్యవసాయ ఆధారిత ప్రాంతాలలో సుస్థిరమైన నీటిపారుదల మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి ఒక సంఘటితమైన ప్రయత్నాన్ని సూచిస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ పునరుత్పాదక ఇంధన, వ్యవసాయ ఉత్పాదకత లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లడానికి చేయూత ఇవ్వడంలో సిఆర్ఐ యొక్క పెరుగుతున్న పాత్రను ఈ నిమగ్నతలు నొక్కి చెబుతున్నాయి.

విశిష్ట రాజ్యాంగంతో విశ్వగురుగా భారత్

- రాజ్యాంగ ఔన్నత్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిదీ
- సంవిధాన్ హత్యా దివస్ ర్యాలీలో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

విశాలాంధ్ర-విజయవాడ: విశిష్ట రాజ్యాంగంతో బలమైన ప్రజాస్వామ్య వ్యవస్థతో భారత్‌కు విశ్వగురుగా ఎదిగే సత్తా ఉందని.. ఇందుకు ప్రతిఒక్కరూ ముఖ్యంగా యువత మద్దతుతో ముందడుగు వేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు.దేశంలో అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) విధించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బుధవారం సంవిధాన్ హత్యా దివస్ నేపథ్యంలో విజయవాడ పాత జీజీహెచ్ వద్ద జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో ప్రత్యేక ర్యాలీని కలెక్టర్ పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు.. సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఆర్.మల్లికార్జునరావు, అధికారులతో కలిసి ప్రారంభించారు. ప్రజాస్వామ్యం వర్ధిల్లాలి.. ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేద్దాం.. చీకటి రోజులు రానివ్వం.. రానివ్వం, చేయిచేయి కలుపుతాం.. ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటిచెబుతాం.. అంటూ ప్రజాస్వామ్య వాదులు, విద్యార్థులు, అధికారులు, సిబ్బంది చేసిన నినాదాలతో ఆసుపత్రి దారిపొడుగునా ర్యాలీ హోరెత్తింది. ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటిచెప్పేలా, ఎమర్జెన్సీ నాటి పరిస్థితులపై అవగాహన కల్పించేలా కళాకారుల ప్రదర్శనలు దేశభక్తిని, రాజ్యాంగ విలువల గొప్పదనాన్ని ప్రతిబింబింపజేశాయి. ఎమర్జెన్సీ పరిస్థితులు భావప్రకటనా స్వేచ్ఛకు, ప్రాథమిక హక్కులకు ఎలా భంగం కలిగించాయో, మానవ హక్కుల ఉల్లంఘనకు ఏ విధంగా కారణమయ్యాయనే విషయాలపై అవగాహన కల్పించడం జరుగుతోందన్నారు. ఎన్నో ప్రాణ త్యాగాల ఫలితమైన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని కలెక్టర్ పేర్కొన్నారు.

చీకటి రోజులు రాకూడదని గొంతెత్తుదాం: సీపీ

ఎమర్జెన్సీ వంటి చీకటి రోజులు మరెప్పుడూ రాకూడదని గొంతెత్తుదామని.. ప్రజాస్వామ్య విలువలను కాపాడుకునేందుకు చేయిచేయి కలుపుతూ ముందడుగు వేద్దామని పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు అన్నారు. ఎంతో శ్రమ, పరిశోధన చేసి బాబా సాహెబ్ డా. బీఆర్ అంబేడ్కర్ ఎంతో ఘనమైన రాజ్యాంగాన్ని అందించారని, దురదృష్టవశాత్తు ఎమర్జెన్సీ విధించడం ప్రజలను కలచివేసిందని పేర్కొన్నారు. ఎందరో ప్రజాస్వామ్యవాదులు జైల్లో మగ్గాల్సిన పరిస్థితి ఎదురైందని.. ఇలాంటి సందర్భాలు మరెప్పుడూ రాకూడదని పేర్కొన్నారు. సహనశీల దేశంలో మానవ హక్కుల ఉల్లంఘన పరిస్థితి ఎదురుకాకూడదని సీపీ రాజశేఖరబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, జిల్లా యువజన సంక్షేమ అధికారి యు.శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ జిల్లా కోఆర్డినేటర్ డా. కొల్లేటి రమేష్, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, పర్యాటక అధికారి ఎ.శిల్ప, డీఆర్‌డీపీ పీడీ ఎఎన్‌వీ నాంచారరావు, క్రీడల అభివృద్ధి అధికారి ఎస్ఏ అజీజ్, డీసీపీ కేజీవీ సరిత, వివిధ కళాశాలల విద్యార్థులు తదితరులు హాజరయ్యారు.

కొలెస్ట్రాల్ నియంత్రణకు సహాయపడే ఆహారాలు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): గుండె జబ్బులు, అధిక రక్తపోటు వంటి జీవనశైలి వ్యాధులను నివారించడానికి కొలెస్ట్రాల్‌ను నియంత్రించడం అత్యంత కీలకం. కొలెస్ట్రాల్‌ను సమర్థవంతంగా నిర్వహించడానికి, సమతుల్య ఆహారాన్ని తీసుకోవడం చాలా ముఖ్యం. బాదం, ఓట్స్, తృణధాన్యాలు, పండ్లు, కూరగాయలు వంటి ఆహారాలను డైట్ లో చేర్చుకోవడం కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రించడం వీలవుతుంది. ఆహారంతో పాటు, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం కూడా చాలా అవసరం అని న్యూఢిల్లీలోని మాక్స్ హెల్త్‌కేర్‌లో డైటెటిక్స్ రీజినల్ హెడ్ రితికా సమద్దర్ పేర్కొన్నారు. బాదం, తృణధాన్యాలు, ఓట్స్, పండ్లు, వెల్లుల్లిలను రోజువారీ ఆహారంలో చేసుకోవాల్సి ఉందని, ఆరోగ్యకరమైన కొలెస్ట్రాల్ స్థాయిలను నిర్వహించ డంలో ఇవి సహాయపడతాయని వివరించారు. ఆరోగ్యకరమైన ఆహారాన్ని స్వీకరించడంతో పాటు, క్రమం తప్పకుండా వ్యాయామానికి ప్రాధాన్యత ఇవ్వడం గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి కీలకమని రితికా సమద్దర్ సూచించారు.